



# విజయభాను

విశాఖపట్నం, ఆదివారం 26-07-2020 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 276 పేజీలు : 8 వెల : 1 రూపాయి





# బియ్యం కార్డే ఇన్‌కమ్ సర్టిఫికెట్

- ఇన్‌కమ్ సర్టిఫికెట్ కాల పరిమితి 4 ఏళ్లకు పొడిగింపు
- దీర్ఘకాలిక సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని డిప్యూటీ సీఎం ఆదేశం
- బాధ్యత స్వీకారోత్సవంలో ఇన్‌కమ్ సర్టిఫికెట్ గడువు పెంపు ఫైళ్లపై తొలి సంతకం
- రెవెన్యూ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్





సచివాలయం : ఆదాయ ధ్రువీకరణ పత్రం (ఇన్ కమ్ సర్టిఫికెట్) కాలపరిమితి ఏడాది నుంచి నాలుగేళ్లకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అలాగే, బియ్యం కార్డుదారులకు ఇకపై ఇన్ కమ్ సర్టిఫికెట్ అవసరం లేదని, ఆ కార్డు వారి ఆదాయానికి కొలమానంగా పేర్కొంటూ మరో నిర్ణయం కూడా తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపడుతూ ఆ రెండు ఫైళ్లపై ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ శనివారం సంతకం చేశారు. సచివాలయంలోని అయిదో బ్లాక్ లో రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రిగా డిప్యూటీ సీఎం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బియ్యం కార్డుదారులకు ఇన్ కమ్ సర్టిఫికెట్ మినహాయింపుతో పాటు ఏడాది నుంచి నాలుగేళ్లకు ఇన్ కమ్ సర్టిఫికెట్ కాల పరిమితి గడువు పెంపుపై ఆయన తన తొలి సంతకం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి

తరువాయి 2లో..

# ‘అక్టోబర్‌లో 5 స్కిల్ కాలేజీల ప్రారంభం’



అమరావతి: ఈ ఏడాది అక్టోబర్‌లో లాంఛనంగా 5 స్కిల్ కాలేజీలను ప్రారంభించ నున్నట్లు ఐటీ, వాణిజ్య శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి వెల్లడించారు. శనివారం ఆయన నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిం చారు. ఈ సమావేశంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ప్రత్యేక కార్యదర్శి జి. అనంతరాము, ఉపాధి, శిక్షణ డైరెక్టర్ లావణ్యవేణి, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ చల్లా మధుసూదన్ రెడ్డి, ఏపీఎస్ఎస్ డీసీ ఎండీ, సీఈవో అర్జా శ్రీకాంత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అక్టోబర్‌లో 5 నైపుణ్య కళాశాలను లాంఛనంగా ప్రారంభించడమే లక్ష్యమని తెలిపారు. చదువు విలువను ప్రపంచానికి చాటిన గాంధీ జయంతి రోజు 4 స్కిల్ కాలేజీల ప్రారంభానికి శ్రీకారం చుట్టామన్నారు. కడప, ఏలూరు, ఒంగోలు, అనంతపురం, నెల్లూరు జిల్లాలలో స్కిల్ కాలేజీల ప్రారంభోత్సం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరగనుందని వెల్లడించారు.

వచ్చే ఏడాది జనవరిలో కొత్తగా మరో 25 స్కిల్ కాలేజీల ప్రారంభానికి సన్నద్ధం కావాలని ఆయన అధికారులకు సూచించారు. అనుకున్న సమయానికి అనుకున్నవి పూర్తి చేసేలా కార్యాచరణ పూర్తి చేయాలని ఆదేశించారు. అదే విధంగా 30 కాలేజీల పర్యవేక్షణకు ‘ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్’ను ఏర్పాటు చేయను న్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. అక్టోబర్‌లో ప్రారంభించే 5 కాలేజీలు పూర్తయ్యాయని ప్రస్తుతం కాలేజీల డిజైన్లు, లేఔట్లకు తుది మెరుగులు దిద్దుతున్నట్లు చెప్పారు. గతేడాది చివరిన నైపుణ్యాశాఖ బృందం భువనేశ్వర్‌లోని సెంచూరియన్ స్కిల్ యూనివర్సిటీలో పర్యటించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో రానున్న స్కిల్ కాలేజీలలో సైతం ‘సెంచూరియన్’ స్థాయి ప్రమాణాలుండాలని దిశానిర్దేశం చేసినట్లు చెప్పారు. స్కిల్ కాలేజీ ఆకృతులు, సైట్లకు సంబంధించిన వ్యవహారాలను పరిశీలించేందుకు ప్రత్యేక ఆర్కిటెక్ బృందం కూడా పర్యటించనుందని వెల్లడించారు. ఆర్థికపరమైన ఇబ్బందులు రాకుండా సీఎస్ఆర్ నిధుల సమీకరణపై మరింత దృష్టి సారించాలన్నారు. కొత్త కోర్సులు, ప్రాధాన్యత రంగాలపై టాప్ కంపెనీల నిపుణులు, విద్యావేత్తలతో చర్చించిన తర్వాత అమోదించ నున్నామన్నారు. ఇప్పటికే కీలక రంగాలలో యువతకు భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలుండే 20 కోర్సులపై అధ్యయనం చేశామని, ప్రపంచ స్థాయి నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, ఉపాధి హై లెవల్ కమిటీ, ఐఎస్‌బీ ఆధ్వర్యంలో శిక్షణ క్లాసులు నిర్వహించ నున్నట్లను పేర్కొన్నారు. పరిశ్రమలకు అవసర మైన కోర్సులు, మానవవనరుల వివరాలపై సర్వేకు కూడా నైపుణ్యశాఖ సిద్ధంగా ఉందని చెప్పారు. త్వరలోనే యాప్ ద్వారా సర్వే ప్రారంభించే అవకాశం ఉందని మంత్రి వెల్లడించారు.

# ఫార్మాసిటీ లోని సాయినార్ కంపెనీ ప్రమాద బాధితులకు ఎక్స్‌గ్రేషియా పంపిణీ





విశాఖపట్నం : పరవాడ ఫార్మా సిటీ లోని సాయినార్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ లో జూన్ 29 వ తేదీన జరిగిన హైడ్రోజన్ సల్ఫైట్ గ్యాస్ లీకేజీ ఘటన లో మరణించిన మహంతి గౌరీ శంకర్ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఎక్స్ గ్రేషియా రూ.15.00 లక్షల మొత్తానికి చెక్కు ను ఆయన భార్య కోట్ల వెంకట లక్ష్మి కి శనివారంతన నివాసంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అందజేశారు. అలాగే సాయినార్ కంపెనీ తరపున ఇస్తున్న ఎక్స్ గ్రేషియా రూ. 35.00 లక్షల మొత్తానికి సంబంధించి ఆయన భార్య కోట్ల వెంకట లక్ష్మి కి రూ. 10.00 లక్షల చెక్ ను, తండ్రి మహంతి లక్ష్మ నాయుడు కు రూ. 12.50 లక్షల చెక్ ను, తల్లి మహంతి అప్పల నరసింహ కు రూ. 12.50 చెక్ లను కూడా మంత్రి చేతుల మీదుగా అందజేశారు.

# ఏపీలో 7,813 కరోనా కేసులు నమోదు

అమరావతి: ఏపీలో కరోనా కోరలు చాస్తోంది. వైరస్ పీడితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ఇవాళ రాష్ట్ర వ్యాప్తంగా 7,813 కొత్త కేసులు నమోదైనట్లు ప్రభుత్వం వెల్లడించింది. దీంతో ఇప్పటి వరకు వైరస్ సోకిన వారి సంఖ్య 88,671కి చేరింది. రాష్ట్రంలో ఇవాళ ఒక్కరోజే 52 మంది ప్రాణాలు కోల్పోగా.. ఇప్పటి వరకు కరోనా కారణంగా మరణించిన వారి సంఖ్య 985కి చేరింది. తాజాగా గుంటూరులో 9 మంది, పశ్చిమగోదావరిలో 8, తూర్పుగోదావరి, కృష్ణా, కర్నూలు జిల్లాల్లో 6, చిత్తూరులో 5, విజయనగరంలో 4, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లో 3, నెల్లూరు, ప్రకాశంలో ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 15,95,674 పరీక్షించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. 43,255 మంది కరోనా నుంచి కోలుకొని డిశ్చార్జి అవ్వగా.. మరో44,431 మంది వివిధ కొవిడ్ ఆస్పత్రులు, క్వారంటైన్ కేంద్రాల్లో చికిత్స పొందుతున్నట్లు బులిటెన్‌లో పేర్కొంది.




# విదేశీ విద్యార్థులపై అమెరికా మరో కీలక ప్రకటన!

వాషింగ్టన్: వీసా విధానంలో కొత్త కొత్త మార్పులను తెస్తున్న అమెరికా ప్రభుత్వం మరో కీలక నిర్ణయం ప్రకటించింది. పూర్తిగా ఆన్‌లైన్ మాధ్యమంలో మాత్రమే బోధనను ఎంచు కుంటున్న కొత్త విద్యార్థులను ఇకపై దేశంలోకి అనుమతించేది లేదని స్పష్టం చేసింది. ఇప్పటికే దేశంలో ఉంటూ ఆన్‌లైన్ తరగతులకు హాజరవుతున్న విదేశీ విద్యార్థులను వెనక్కి పంపాలన్న ఉత్తర్వులను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ తరుణంలో తాజా నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

కరోనా సంక్షోభం నేపథ్యంలో అమెరికాలో ఉంటూ ఆన్‌లైన్ తరగతులకు హాజరవుతున్న విదేశీ విద్యార్థులను వెనక్కి పంపాలన్న ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దేశవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో మొత్తం ఎనిమిది వ్యాజ్యాలు దాఖలయ్యాయి. దాదాపు 200 పైగా విద్యా సంస్థలు వీటిపై సంతకాలు చేశాయి. హార్వర్డ్, ఎంఐటీ వంటి దిగ్గజ విశ్వవిద్యాలయాలు సైతం ఈ విషయంపై కోర్టుకు వెళ్లాయి. వీరికి సాంకేతిక దిగ్గజ సంస్థలైన గూగుల్, ఫేస్‌బుక్, మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలూ మద్దతుగా నిలిచాయి. మహమ్మారి సంక్షోభం నేపథ్యంలో ఆన్‌లైన్ తరగతులపై ఉన్న పరిమితుల్ని ఎత్తివేస్తూ మార్చి 13న ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్ మెంట్(ఐసీఈ) తీసుకున్న నిర్ణయానికి ట్రంప్ తాజా ఉత్తర్వులు విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు.

ట్రంప్ నిర్ణయంతో ఎఫ్-1 వీసాపై అమెరికాలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులతోపాటు, ఎం-1 వీసాపై వృత్తివిద్యా కోర్సులు అభ్యసిస్తున్నవారు తీవ్ర గందరగోళంలో పడ్డారు. ఎట్టకేలకు ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

తాజాగా కొత్త విద్యార్థులను అనుమతించేది లేదని తెలిపారు. కరోనా మహమ్మారి వ్యాప్తి నేపథ్యంలో మూతపడ్డ విద్యాసంస్థల్ని ఎలాగైనా తెరిపించాలన్న దురుద్దేశంతోనే ట్రంప్ ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి.

# వారి త్యాగాలు వెలకట్టలేనివి : చంద్రబాబు

అమరావతి: కరోనా వ్యాప్తి నియంత్రణలో ఫ్రంట్‌లైన్ వారియర్స్ త్యాగాలు, సేవలు వెలకట్టలేనివని తెదేపా అధినేత చంద్రబాబు కొనియాడారు. కరోనా మహమ్మారిపై అందరికీ అవగాహన అవసరమని ఆయన అన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ వైద్యులతో చంద్రబాబు వర్చువల్ సమావేశం నిర్వహించారు. కరోనా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అధ్యయనాలను ఎప్పటికప్పుడు కేంద్రానికి పంపుతున్నానని చెప్పారు. కరోనాపై పోరాడుతున్న ఫ్రంట్ లైన్ వారియర్స్‌ను

తరువాయి 2లో..

# మరిన్ని పడకలు సిద్ధం చేయాలని ఆదేశం

## - జిల్లా కలెక్టర్ వి.వినయ్‌చంద్



విశాఖపట్నం : మరిన్ని పడకలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ వైద్యులను ఆదేశించారు.

కోవిడ్-19ను ఎదుర్కొనేందుకు తగిన చర్యలు తీసు కొనేందుకు తగిన చర్యలు నిమిత్తం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వైద్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో కోవిడ్-19 సేవలు అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఎఎంసి ప్రిన్సిపల్ డా. పి.వి. సుధాకర్ ను ఆదేశించారు. కోవిడ్-19 ను ఎదుర్కొనేందుకు నిదులు సమస్య లేదని, స్పెషలిస్టులు, వైద్యులు అందరూ సహకరించి కోవిడ్ ఎదుర్కొనేందుకు సహకరించాలని కోరారు. జిల్లాలో పాజిటివ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా ఇలాంటి సమయంలో వైద్యులు తమవంతు సహకారం అందించాలని ఐ.ఎం.ఎ., వైజాగ్ చాప్టర్ లను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్-2 పి. అరుణ్ బాబు, ఎఎంసి ప్రిన్సిపల్ డా. పి.వి. సుధాకర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తిరుపతిరావు, ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్ దవళ భాస్కరరావు, ఐ.ఎం.ఎ., చాప్టర్, వైజాగ్ నుండి కోవిడ్-19 జిల్లా కో ఆర్డినేటర్ డా. బి. గోవిందరాజు, ఐఎంఎ కార్యదర్శి డా. కె. ఫణీందర్, తదితరులు పాల్గొన్నారు.

# కిశోర్ మృతి పట్ల చంద్రబాబు దిగ్భ్రాంతి



అమరావతి: ఏపీ మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు అత్యంత సన్నిహితుడు నలందకిషోర్ మృతి పట్ల తెదేపా అధినేత చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కిశోర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైకాపా వేదింపులకు మనస్తాపంతో మృతి చెందడం బాధాకరమని ఆయన అన్నారు. ప్రభుత్వ దుశ్చర్యలను ఖండిస్తున్నట్లు చెప్పారు. " సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ పెట్టాడని కేసులు బనాయించారు. కరోనా పరిస్థితుల్లో విశాఖ నుంచి కర్నూలుకు తరలించారు. పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పి శారీరకంగా, మానసికంగా వేధించారు. ఈ క్షోభ తట్టుకోలేకే కిశోర్ తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఆయన మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి" అని చంద్రబాబు డిమాండ్ చేశారు.

# రాజమహేంద్రవరంలో హర్షకుమార్ నిరసన దీక్ష



రాజమహేంద్రవరం: తూర్పుగోదావరి జిల్లా సీతానగరంలో శిరోముండనం వ్యవహారంలో అసలైన దోషులను పట్టుకోవాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎంపీ హర్షకుమార్ బాధితుడు ప్రసాద్‌తో కలిసి ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు. రాజమహేంద్రవరంలోని ఆయన నివాసంలో హర్షకుమార్ దీక్షకు కూర్చున్నారు. ఈ వ్యవహారంలో కాల్ డేటా ద్వారా పోలీసులు నిందితులను పట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎవరికి వారు తమ ఇళ్లలోనే కూర్చుని దీక్షకు మద్దతు తెలపాలని హర్షకుమార్ పిలుపునిచ్చారు. తెలుగుదేశం, కాంగ్రెస్, భాజపా, జనసేన, వామపక్షాలు తమకు మద్దతివ్వాలని విజ్ఞప్తి చేశారు. శిరోముండనం ఘటనతో పాటు కోరుకొండ మైనర్ బాలిక సామూహిక అత్యాచారం, చీరాలలో పోలీసుల లాఠీ దెబ్బలకు మృతి చెందిన యువకుడితో పాటు దళితులపై జరుగుతున్న దాడులకు సంబంధించి న్యాయం చేయాలని త్వరలోనే రాష్ట్రపతిని కలుస్తామని హర్షకుమార్ చెప్పారు.

# కరోనాను జయించి.. తిరిగి విధులకు

కాకినాడ : కరోనాను జయించిన కానిస్టేబుల్‌కు పోలీస్ స్టేషన్‌లో ఘన స్వాగతం లభించింది. వివరాల ప్రకారం..తిమ్మాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కానిస్టేబుల్ సత్యనారాయణకు కొన్ని రోజుల క్రితం కరోనా సోకింది. దీంతో 28 రోజులపాటు క్వారంటైన్‌లో ఉన్న అనంతరం విధులకు హాజరయ్యారు. దీంతో స్టేషను వద్దనే కానిస్టేబుల్ సత్యనారాయణకు శాలువా, పూలమాలతో ఎస్సై విజయబాబు సాదరంగా ఆహ్వానించారు. మిగతా సిబ్బంది కూడా పూల వర్షం కురిపించి స్వాగతం పలికారు. ఇక రెండు రోజుల క్రితం అమలాపురం పట్టణం పద్మినీ పేటకు చెందిన యువతికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది.

# సెయింట్ లూక్స్ ఆన్‌లైన్ తరగతులనుపర్యవేక్షించిన ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వీసీ డా.పి.శ్యామ్‌ప్రసాద్

- లూక్స్ ప్రత్యేక మొబైల్ యాప్ విడుదల
- విద్యార్థినులను, యాజమాన్యాన్ని అభినందించిన వీసీ



విశాఖపట్నం : విశాఖ నగరంలోని ప్రముఖ నర్సింగ్ విద్యాసంస్థ సెయింట్ లూక్స్ కాలేజీ ఆఫ్ నర్సింగ్‌లో గత మూడునెలలుగా కొనసాగుతున్న ఆన్ లైన్ తరగతులను ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డా.పి.శ్యామ్ ప్రసాద్ శనివారం పర్యవేక్షించారు. ఎండాడలోని నర్సింగ్ కళాశాలను సందర్శించి, పత్యేకంగా రూపొందించిన సెయింట్ లూక్స్ యాప్‌ను ఈ సందర్భంలో అధికారికంగా ఆవిష్కరించారు. ఈడేకోఫీ స్టూడెంట్ మేనేజ్ మెంట్ సిస్టమ్ పేరుతో ఈ మొబైల్ యాప్‌ను ఆండ్రావ్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అభివృద్ధి చేసింది. ఈ సందర్భంగా వీసీ ఆన్‌లైన్‌లో విద్యార్థినులతో మాట్లాడారు. తరగతులు జరుగుతున్న తీరును, వారుపొందుతున్న విజ్ఞానాన్ని అడిగి తెలుసుకొని వారికి పలు సలహాలిచ్చారు. బీయస్సీ నర్సింగ్ నాలుగో సంవత్సరం చదువుతూ, పలు ఆసుపత్రుల్లో ఇన్‌టెన్‌షిప్ పొందుతున్న విద్యార్థినులతో ఆయన ముచ్చటించారు. కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో కోవిడ్ ఆసుపత్రుల్లో సేవలందిస్తున్న వారిని అభినందించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని విద్యార్ధునులకు ఆన్‌లైన్ ద్వారా గత మూడునెలలుగా సిలబస్ ప్రకారం తరగతులను నిర్వహిస్తున్న యాజమాన్యాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. పలు తరగతిగదులు,లైబ్రరీ,ల్యాబులు,ఇతర సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కరోనా కట్టడికి ప్రభుత్వం, పలుశాఖల అధికారులు, డాక్టర్లు, నర్సులు, ఎంతగానో శ్రమిస్తున్నారని కరోనామీద పైచేయి సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సెయింట్ లూక్స్ విద్యాసంస్థ ఎంతో ఉన్నతమైన నర్సింగ్ విద్యను అందిస్తూ ఎందరికో ఉపాధి అవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు.

కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.డి.ప్లోరెన్స్ నైటింగేల్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎం.ప్రీతమ్ లూక్ మాట్లాడుతూ ఆన్ లైన్ క్లాసుల ద్వారా మన రాష్ట్రంతో పాటు పలు రాష్ట్రాలలో వున్న తమవిద్యార్థినులకు పూర్తి స్థాయి పాఠాలను క్లాసురూంకు ధీటుగా అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధిస్తున్నామన్నారు.

ప్రతిరోజూ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4వరకూ ఈ తరగతులు తమ మొబైల్ యాప్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఝాన్సీ రూత్, డాక్టర్ అంబేద్కర్, పలువురు అధ్యాపకులు, సిబ్బంది ఇన్‌టెన్‌షిప్ విద్యార్ధునులు పాల్గొన్నారు.

# చైనా గ్రీన్‌సిగ్నల్: వ్యాక్సిన్ తయారీలో పోటీ

## ఆక్స్‌ఫర్డ్‌తో పోటీ పడుతున్న చైనావ్యాక్సిన్లు

న్యూఢిల్లీ : ప్రాణాంతక కరోనా వైరస్ ప్రపంచాన్ని చుట్టేసిన నేపథ్యంలో వ్యాక్సిన్ కోసం శాస్త్రవేత్తలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే మొదలైన ప్రయోగాల్లో ప్రపంచ దేశాలు పోటీపడుతున్నాయి. ఈ క్రమంలోనే చైనా శాస్త్రవేత్తలు ఆదివారం కీలక ప్రకటన చేశారు. తాము రూపొందించిన వ్యాక్సిన్ అన్ని ప్రయోగాల్లో విజయవంతమై.. విడుదలకు అనుమతి పొందిందని ప్రకటించారు. కరోనాకు విరుగుడుగా డ్రాగాన్ తయారు చేసిన కిన్సినో బయో వ్యాక్సిన్ లిమిటెడ్‌కు చైనా ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఆ దేశానికే చెందిన వూహన్, సినోవాక్ వ్యాక్సిన్లు మూడు దశల్లోనూ ప్రయోగాలను పూర్తిచేసుకున్నాయి. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆశలు రేకెత్తించిన ఆక్స్‌ఫర్డ్‌తో చైనా కంపెనీలు పోటీపడుతున్నాయి.

ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ వ్యాక్సిన్ ఇప్పటికే మూడు ఫేజ్‌లను పూర్తిచేసుకుని బహిరంగ మార్కెట్లోకి రావడానికి సిద్ధంగా ఉంది. దీనిపై ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తినెలకొంది. ఇక ఆస్ట్రేలియా సైతం కరోనా విరుగుడు తయారీలో దూసుకుపోతోంది. ఆ దేశ శాస్త్రవేత్తల కృషి ఫలితంగా మార్డోక్ వ్యాక్సిన్ ప్రయోగాలను విజయవంతంగా పూర్తి చేసుకుంది. త్వరలోనే బహిరంగ మార్కెట్‌లో విడుదల చేయడానికి ఆ దేశ వైద్య పరిశోధన మండలి అనుమతి కోసం ఎదురుచేస్తున్నారు. ఇక భారత్ బయోటెక్ ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్న కోవాగ్జిన్ సైతం ప్రయోగాల్లో సత్ఫలిస్తోందని ఐసీఎంఆర్ ఇదివరకే ప్రకటించింది.

అయితే మన దేశంలో తయారు చేసే వ్యాక్సిన్ రావడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని వైద్య నిపుణులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా, చైనా, ఆస్ట్రేలియా దేశాలు తయారుచేసిన వ్యాక్సిన్‌పై భారత్ ఆధారపడక తప్పదని అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లోకి వ్యాక్సిన్ వచ్చిన వెంటనే పెద్ద ఎత్తున ఆర్డర్ ఇచ్చేందుకు భారత్‌కు చెందిన కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి.

అయితే అవి భారత్‌లో వ్యాపించిన కరోనా వైరస్‌ని చంపగలవా? దేశ ప్రజలపై అది ప్రభావం చూపుతుందా అనే సందేహం పలువురిలో వ్యక్తమవుతోంది. దీనిపై సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ (సీసీఎంబీ) శాస్త్రవేత్తలు లోతైన పరిశోధనలు జరిపారు. ప్రపంచ దేశాలకు ఎలాంటి కరోనా వైరస్ సోకిందో, భారత్‌లోనూ అదే వైరస్ వ్యాప్తి చెందిందని అందువల్ల ప్రపంచ దేశాలు వాడే వ్యాక్సిన్ భారతీయులూ వాడొచ్చని డైరెక్టర్ రాకేష్ మిశ్రా తెలిపారు.

# ట్రంప్ క్షమాపణలు చెప్పాలి.. వుహాన్ ల్యాబ్ శాస్త్రవేత్త



హైదరాబాద్: చైనాలోని వుహాన్‌లో ఉన్న వైరాలజీ ల్యాబ్ నుంచి కరోనా వైరస్ ప్రపంచం అంతా పాకినట్లు ఆరోపణలు ఉన్న విషయం తెలిసిందే. అయితే ఆ ఆరోపణలపై ఆ ల్యాబ్‌లో కరోనా వైరస్‌లపై స్టడీ చేస్తున్న వైరాలజిస్ట్ షీ జెంగ్లీ తొలిసారి స్పందించారు. వుహాన్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ వైరాలజీలో ఆమె 15 ఏళ్ల నుంచి గబ్బిలాల ద్వారా సోకే సార్స్ లాంటి వైరస్‌లపై అధ్యయనం చేస్తున్నది. అయితే వుహాన్ ల్యాబ్ నుంచి వైరస్ బయటపడినట్లు ట్రంప్ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఇంకా ఆ ల్యాబ్‌లోనే కృత్రిమ వైరస్‌ను సృష్టించి ఉంటారన్న వదంతులు కూడా వ్యాపించాయి. ఈ అంశాలపై వైరాలజిస్ట్ షీ జెంగ్లీ సైన్స్ మ్యాగ్జిన్‌కు సమాధానం ఇచ్చారు.

వైరస్ పుట్టుక, దాని పరిశోధన గురించి ఆమె ఆసక్తికర సమాధానాలు ఇచ్చారు. %హూా=హా-జశీఎ%-2 తమ ల్యాబ్ నుంచి వచ్చినట్లు ట్రంప్ చేసిన ఆరోపణలు వాస్తవం కాదన్నారు. ఆ వ్యాఖ్యలు తమ ప్రయోగాల్ని దెబ్బతీస్తాయని, వ్యక్తిగత జీవితం కూడా నాశనం అవుతుందన్నారు. ట్రంప్ తన వ్యాఖ్యల పట్ల క్షమాపణలు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.

న్యూమోనియా వచ్చిన రోగుల శ్యాంపిళ్లు తన ల్యాబ్‌కు గత ఏడాది డిసెంబర్ 30వ తేదీన వచ్చినట్లు ఆమె చెప్పారు. అంతకుముందు SARS-CoV-2 లాంటి వైరస్ గురించి వినలేదు, స్టడీ చేయలేదన్నారు. వుహాన్‌తో పాటు స్వదేశీ ల్యాబ్‌ల్లో వైరస్‌ను పరీక్షించి వేగంగా ప్యాథోజెన్ గుర్తించినట్లు చెప్పారు. తమ ల్యాబ్ నుంచి ఎటువంటి వైరస్ లీక్ కాలేదని, తమ ల్యాబ్‌లో ఉన్న గబ్బిలాల వైరస్ సీక్వెన్స్‌తో SARS-CoV-2ను సరిపోల్చలేకపోయినట్లు ఆమె చెప్పారు. గతంలో వుహాన్ ల్యాబ్‌లో వందల సంఖ్యలో గబ్బిలాలకు చెందిన వైరస్‌లను గుర్తించామని, కానీ ఎప్పుడూ SARS-CoV-2 వైరస్‌ను గుర్తించలేదని షీ జెంగ్లీ తెలిపారు.

గబ్బిలాల్లో ఉండే RaTG13 వైరస్ SARS-CoV-2కు సమానంగా ఉన్నట్లు భావించారు. అయితే ఆ రెండు వైరస్‌లను స్టడీ చేసిన శాస్త్రవేత్తలు.. రెండింటి మధ్య సీక్వెన్స్ తేడాకు కారణం అంచనా వేశారు. బహుశా 20 నుంచి 70 ఏళ్ల మధ్య ఒకే విధమైన పూర్వీకుల నుంచి ఆ వైరస్ సంక్రమించినట్లు గుర్తించారు. తమ ల్యాబ్‌లో ఎప్పుడూ RaTG 13 వైరస్‌ను కల్చర్ చేయలేదన్నారు. పూర్తి బయోసేఫ్టీ రూల్స్ ప్రకారం తాము పరీక్షలు చేపడుతామన్నారు. తమ ల్యాబ్‌ను ప్రతి సంవత్సరం ప్రభుత్వం తనిఖీ చేస్తుందన్నారు. SARS-CoV-2 లేదా సార్స్ సంబంధిత వైరస్‌లతో తమ ఇన్స్‌టిట్యూట్‌లోని వారెవ్వరికీ వైరస్ సోకలేదన్నారు. యాంటీబాడీ పరీక్షల ద్వారా ఆ నిర్ధారణకు వచ్చినట్లు ఆమె చెప్పారు. SARS-CoV%-2 వైరస్ గురించి షీ జెంగ్లీ ఇచ్చిన రిపోర్ట్‌ను ఇతర మేటి వైరాలజీ శాస్త్రవేత్తలు కూడా అంగీకరించారు.

మొదటి పేజీ తరువాయి

# బియ్యం కార్డే ఇన్ కమ్ సర్టిఫికెట్



తనకు కీలకమైన రెవెన్యూ, స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్ల శాఖ అప్పగించారన్నారు. తనపై ఆయన ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలియజేశారు. సీఎం ఆశయ సాధన మేరకు త్రికరణ శుద్ధిగా పనిచేస్తూ, రెవెన్యూ శాఖలో ఉన్న సమర్థవంతమైన అధికారుల సాయంతో పారదర్శకమైన సేవలు అందిస్తానన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా, అన్ని వర్గాలకూ సమతుల్యత పాటిస్తూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సహా అయిదుగురికి డిప్యూటీ సీఎంలుగా అవకాశమిచ్చాన్నారు. తన ఏడాది పాలనలోనే దేశంలో అత్యుత్తమైన ముఖ్యమంత్రుల్లో సీఎం జగన్ నాలుగో స్థానంలో నిలిచారని కొనియాడారు. దిశ చట్టం, ప్రైవేటు పరిశ్రమల్లో స్థానికులకే 75 శాతం ఉద్యోగాలు వంటి ఎన్నో వినూత్న కార్యక్రమాలతో ప్రజల మనస్సుల్లో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక స్థానం పొందారన్నారు. భూ ంవివాదాల పరిష్కారానికి త్వరలో భూ సర్వే చేపట్టనున్నట్లు డిప్యూటీ సీఎం, రెవెన్యూ మంత్రి ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. బియ్యం కార్డే ఇన్ కమ్ సర్టిఫికెట్ గా గుర్తించడం వల్ల పేదలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఇన్ కమ్ సర్టిఫికెట్ ఏడాది నుంచి నాలుగేళ్లకు పెంచుతూ తీసుకున్న నిర్ణయం వల్ల ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే ప్రయాస తప్పుతుందన్నారు. పేదలందరికీ సొంతిళ్లు ఉండాలన్నదే సీఎం జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని, దీనిలో భాగంగా ఆగస్టు 15వ తేదీన 30 లక్షల ఇళ్ల పట్టాలు ఇవ్వనున్నారని తెలిపారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల గడప వద్దకే పాలన తీసుకొచ్చామన్నారు. ప్రజల ఆశీస్సులు మెండుగా పొందుతున్న సీఎం జగన్మోహన్ రెడ్డి మరో 30 ఏళ్ల పాటు పాలన సాగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

**దీర్ఘకాలిక సమస్యలకు సత్వర పరిష్కారాలు...**

రెవెన్యూ శాఖలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలకు సత్వర పరిష్కారాలు చూపాలని ఆ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ ఆదేశించారు. రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన సంబంధిత శాఖాధికారులతో సమీక్షా సమావేశాన్ని తన ఛాంబర్ లో నిర్వహించారు. భూ తగదాల పరిష్కారినికి ప్రభుత్వం త్వరలో భూ రీ సర్వే చేపట్టనుందని ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ఉషారాణి.. .డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకొచ్చారు. మాన్యూవల్ లో ఉన్న భూ రికార్డులను కంప్యూటరీకరణ చేస్తున్నామని సీసీఎల్ఏ జాయింట్ సెక్రటరీ సీఎచ్. శ్రీధర్ తెలిపారు. రెవెన్యూ శాఖలో సకాలంలో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్ల శాఖలో చేపడుతున్న పలు కార్యక్రమాలను డిప్యూటీ సీఎంకు అధికారులు వివరించారు.

అంతకుముందు సచివాలయంలోని అయిదో బ్లాక్ లో వేదపండితుల మంత్రోచ్ఛారణాల నడుమ రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రిగా, డిప్యూటీ సీఎంగా మంత్రి ధర్మాన కృష్ణదాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్సీపీ నేతలు, అధికారులు పాల్గొని... డిప్యూటీ సీఎంకు అభినందనలు తెలియజేశారు.



# నలంద కిషోర్‌ది ముమ్మాటికీ పోలీసు హత్యే

## నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు

దిల్లీ: విశాఖలో నలంద కిషోర్ మృతి తనను ఎంతగానో బాధించిందని నరసాపురం వైకాపా ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. శనివారం దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... నలంద కిషోర్‌ది ముమ్మాటికీ పోలీసు హత్యేనని ఆరోపించారు.

"సోషల్ మీడియాలో మెసేజ్ ఫార్వర్డ్ చేసినందుకే ఆయనపై కసులు పెట్టి వేధించారు. కిషోర్ పెట్టిన పోస్టుల్లో ఎవరి పేరూ లేకపోయినా పోలీసులు అరెస్టు చేసి కర్నూలు తీసుకెళ్లారు. ఆరోగ్యం బాగా లేకున్నా విశాఖ నుంచి కర్నూలుకు కారులో తరలించారు. కిషోర్‌ను తరలించిన సమయంలో కర్నూలులో కరోనా కేసులు ఉద్ధృతంగా ఉన్నాయి. కరోనాతోనే కిషోర్ చనిపోయినట్టు నా మిత్రుల ద్వారా తెలిసింది. కావాలనే అయన్ను కర్నూలు తీసుకెళ్లి కరోనా అంటించారు. ఇది ముమ్మాటికీ పోలీసు హత్యగానే భావించాలి. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు తూట్లు పొడుస్తున్నారు. జీవించే హక్కును కూడా మా ప్రభుత్వం హరింపజేస్తుందా?. ప్రభుత్వానికి సూచనలు చేశానన్న కారణంగా నాపై కూడా అనర్హత పిర్యాదు చేశారు. ఇలాంటి విషయాల్లో పోలీసులను ప్రోత్సహించవద్దని కోరుతున్నా. పోలీసుల దమనకాండను ప్రభుత్వాధినేతగా జగన్ ఆపేయాలి. స్నేహితుడిని పోగొట్టుకున్న వ్యక్తిగా బాధతో మాట్లాడుతున్నా. గతంలో సామాజిక మాధ్యమాల్లో వైకాపా తరపున పెట్టిన పోస్టులపై ప్రశ్నిస్తే జగన్ విమర్శించారు. సహించలేని స్థితికి వెళ్తే ప్రజలు ఎదురు తిరిగే పరిస్థితి వస్తుంది. రాష్ట్రంలో భావప్రకటన, జీవించే హక్కు లాంటి ప్రాథమిక హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతోంది. ఇదంతా సీఎంకి తెలిసి జరుగుతుందో... తెలియక జరుగుతుందో అనే అనుమానం కలుగుతోంది. సంక్షేమ పథకాలు కాదు.. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. ఇందుకు బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలి" అని రఘురామకృష్ణరాజు డిమాండ్ చేశారు. నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ కేసులో కూడా కోర్టు ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ఆలోచనలో లేనట్టు సమాచారం ఉందని తెలిపారు. జస్టిస్ కనగరాజ్‌తో మరో పిటిషన్ వేయించే ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలిసిందని చెప్పారు.

# వారి త్యాగాలు వెలకట్టలేనివి

కాపాడుకోవాలన్నారు.

" గత 2 వారాల్లో ఏపీలో కరోనా వృద్ధి రేటు అత్యధికంగా ఉంది. మరణాల్లోనూ దేశంలోనే రెండో స్థానంలో ఉంది. ప్రజలను అప్రమత్తం చేయడం తప్ప ప్రస్తుతానికి మందులు లేవు. డిజిటల్ సోషలైజేషన్, భౌతిక దూరం రెండూ ముఖ్యమే. ఎక్కువ మందిని ఒకే అంబులెన్స్‌లో తీసుకొస్తున్నారు.

దీనివల్ల పాజిటివ్ లేనివారికి కూడా వచ్చే అవకాశముంది. అంబులెన్స్‌లు, ఆస్పత్రుల్లోనూ శానిటైజేషన్ ఎంతో ముఖ్యం" అని చంద్రబాబు అన్నారు. క్వారంటైన్ కేంద్రాల్లో తగిన వసతులు ఉంటే రోగులు భయపడకుండా ఉంటారని చంద్రబాబు అన్నారు.

# రక్షణ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ ఎంవివికి వినతిపత్రం



భీమునిపట్నం : హుదూద్ తుఫాన్ కు కూలిపోయిన , భీమిలి సముద్ర తీర ప్రాంత రక్షణ గోడకు కేంద్ర విపత్తుల శాఖ నుంచి నిధులను సమకూర్చి తీరప్రాంతం లో ఉన్న మత్స్యకారులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ మత్స్యకార యువజన సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ శనివారం విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎంవివి.సత్యనారాయణ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ విషయంపై ఎంపీ ఎం వి వి సత్యనారాయణ స్పందిస్తూ జిల్లా మంత్రి అవంతి శ్రీనివాస్ మంత్రి కురసాల కన్నబాబు లతో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రక్షణ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారని జానకిరామ్ తెలిపారు.

2014 అక్టోబర్ 12వ తేదీన భీమిలి విశాఖ సముద్ర తీర ప్రాంతంలో హుదూద్ లో సముద్రం ముందుకు రావటం వలన భీమిలి తీర ప్రాంతం అంతా కోతకు గురై లైట్ హౌస్ నుంచి ఎగువ పేట పోలమాంబ అమ్మవారి ఆలయం వరకు గల మధ్య ప్రాంతంలో సముద్ర తీర ప్రాంత రక్షణ గోడ మరియు బోయివీధి వద్ద రహదారి పాడైపోయిందని అప్పటి ప్రభుత్వం తాత్కాలిక మరమ్మతులు చేసిన సమస్య పరిష్కారానికి పూర్తిగా కృషి చేయలేదని గత ప్రభుత్వం అలసత్వం వలన రక్షణ గోడ నిర్మాణాన్ని మంజూరు చేసిన నిధులు కూడా వెనుకకు వెళ్లిపోవడంతో ప్రస్తుతం నిధుల లేమితో రోడ్డు రక్షణ గోడ నిర్మాణం చేపట్టలేద ని విపత్తుల శాఖ అధికారులు తెలియజేసారని జానకిరామ్ తెలిపారు. మంత్రి అవంతి శ్రీనివాస్ రావు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సహకారం తో జీవీఎంసీ నుంచి గాని కేంద్ర విపత్తుల శాఖ నుంచి గాని నిధులు సమకూర్చినట్లయితే రక్షణ గోడ నిర్మాణం పూర్తిఅయితే తీరప్రాంతం లో జీవిస్తున్న మత్స్యకారులకు న్యాయం జరుగుతుందని. ఈ విషయం మీద మంత్రి అవంతి శ్రీనివాస్ పై ప్రత్యేక దృష్టి సారించి రక్షణ గోడ నిర్మాణం పూర్తి చేసి పేద మత్స్యకారులకు న్యాయం చేయాలని జానకిరామ్ తెలిపారు.

## అయోధ్యలో రామమందిరం నిర్మాణానికి ఆదిత్యుని మట్టి



అరసవల్లి: అయోధ్యలో రామ మందిరం నిర్మాణం శంకుస్థాపనకు జిల్లాలోని ప్రధాన దేవాలయం నుండి పవిత్రమైన మట్టి సేకరించి ఆగస్టు 5వ తేదీన అయోధ్యకు అందించు కార్యక్రమంలో భాగంగా ఈరోజు అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి దేవాలయంలో పవిత్రమైన మట్టిని రాష్ట్రీయ స్వయంసేవక్ వారు భజరంగదళ్ వారు సంయుక్తంగా దేవాలయం ప్రధాన అర్చకులు అయినటువంటి ఇప్పిలి శంకర శర్మ నుండి మట్టిని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్. ఎస్. ఎస్ సభ్యులు అయినటువంటి డి. వి. వి. రమణ మూర్తి , పి.వి.రమణ మూర్తి మరియు భజరంగదళ్ సభ్యులు అయినటువంటి శ్రీరంగం మధుసూదన్ రావు, రావాడ రాజశేఖర్, గుజ్జల రాజవెంకటి, వనజల శ్రీనివాస్ మొదలగున సభ్యులు పాల్గొన్నారని ఆలయ ఈవో వి. హరి సూర్య ప్రకాష్ గారు తెలిపారు.

# కరోనా చికిత్సకి ప్రైవేట్ వైద్యనిపుణుల సహకారం

విశాఖట్నం : కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో బాధితుల చికిత్సకి విశాఖ జిల్లాలో ప్రైవేట్ వైద్య నిపుణుల సహకారం తీసుకోనున్నట్లు ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ఉత్తరాంధ్ర కోవిడ్ నోడల్ అధికారి డాక్టర్ సుధాకర్ అన్నారు. ఐఎమ్ఏ అధ్వర్యంలో విశాఖలో 1400 మందికి పైగా వివిధ వైద్య నిపుణులు ఉన్నారని, ఇందులో అధికశాతం వైద్య నిపుణులతో కరోనా పేషేంట్లకి చికిత్స అందించేందుకు భవిష్యత్‌లో సహకారం తీసుకుంటామన్నారు. ఇందుకోసం ఇండియన్ మెడికల్ అసోషియేషన్‌తో కూడా చర్చిస్తున్నామన్నారు.

జిల్లాలోని ఆసుపత్రులని ఎ, బి, సి క్యాటగిరీలుగా విభజించామని.. ఎ కేటగిరి ఆస్పత్రులను కేవలం కోవిడ్ పేషెంట్ల చికిత్స కోసమేనని.. బి కేటగిరి ఆస్పత్రులలో సగం బెడ్స్‌ని కోవిడ్ పేషెంట్ల కోసం అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఎ, బి కేటగిరీలలో విశాఖ సిటీలో 22 ఆసుపత్రులని గుర్తించామని ఇందులో 14 ప్రైవేట్ ఆసుపత్రులు కూడా ఉన్నాయన్నారు.

హెూం ఐసోలేషన్‌లో ఉన్న కరోనా బాధితుల కోసమే నిపుణులతో కూడిన టెలీ మెడిసిన్ ఏర్పాటవుతోందన్నారు.

కాగా.. పెరుగుతున్న కేసులకి తగ్గట్లు ముందస్తు ఏర్పాట్లకి సిద్ధమవుతున్నట్లు నోడల్ అధికారి డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు.

## వర్సిటీ రెక్టార్‌గా ఆచార్య కె.సమత పదవీ బాధ్యతల స్వీకరణ



ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆంధ్రవిశ్వవిద్యాలయం రెక్టార్‌గా ఏయూ భౌతిక శాస్త్ర విభాగం ఆచార్యులు కె.సమత పదవీ బాధ్యతలను చేపట్టారు. శనివారం ఉదయం వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు రెక్టార్‌గా పదవీ బాధ్యతలు అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

అనంతరం ఆచార్య కె.సమత వర్సిటీలోని సి.ఆర్ రెడ్డి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, వై.ఎస్ రాజశేఖర రెడ్డి, మహాత్మ జ్యోతిరావు పూలే, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్, పాలక మండలి సభ్యులు ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య క్రిష్ణమంజరి పవార్, ఆటా అధ్యక్షులు ఆచార్య జాలాది రవి, ఏయూఇయూ అధ్యక్షుడు జి.రవికుమార్, అకడమిక్ డీన్ ఆచార్య కె.వెంకట రావు, ఆచార్య పి.అర్జున్, ఆచార్య టి.షారోన్ రాజు, ఆచార్య వి.సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిత్యావసర వస్తువులు పంపిణీ



భీమునిపట్నం: స్థానిక సి.బి.ఎం. స్కూల్ ఎదురుగా ఉన్న మహాత్మ గాంధీ కళ్యాణ మండపంలో శనివారం వైసీపీ నాయకులు వాసుపల్లి.

కొండబాబు, అల్లిపిల్లి నర్సింగరావు, కదిరి ఎల్లాజీ ల ఆధ్వర్యంలో భీమిలి , తగరపువలస పత్రికా విలేఖరులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు విలేకరులు వారధిగా ఉంటూ ఎప్పటికప్పుడు తాజా సమాచారం అందిస్తారని అందుకు విలేఖరులను అభినందించాలని వారు అన్నారు సామాజిక దూరం పాటించి నిత్యావసర సరుకులు అందజేశారు.

## అయోధ్య రాముడికి యోగి పూజలు.. పనులు పరిశీలించిన యూపీ సీఎం



హైదరాబాద్: ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఇవాళ అయోధ్యలో పర్యటించారు. అక్కడ రాజజన్మభూమిలో ఉన్న శ్రీరాముడికి పూజలు చేశారు. భరత, శతృఘ్న, లక్ష్మణులకు కూడా సీఎం యోగి పూజలు నిర్వహించారు. సుప్రీం తీర్పు నేపథ్యంలో అయోధ్యలో ఆగస్టు 5వ తేదీన రామాలయ నిర్మాణం కోసం భూమిపూజ జరగనున్నది. ఆ కార్యక్రమానికి ప్రధాని మోదీతో పాటు అన్ని రాష్ట్రాల సీఎంలు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో సీఎం యోగి ఇవాళ అక్కడ జరుగుతున్న పనులు పర్యవేక్షించారు. శంకుస్థాపన గురించి శ్రీ రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్, స్థానిక అధికారులతో సీఎం యోగి చర్చించారు.

హనుమాన్ గర్హిలో ఉన్న హనుమంతుడికి కూడా యోగి పూజలు చేశారు. ఆయన తర్వాత ఆయన.. ప్రత్యక్షంగా పనులు పర్యవేక్షించారు. రామాలయం కోసం తెచ్చిన శిలలను ఆయన పరిశీలించారు. శంకుస్థాపన కోసం అయిదు వెండి ఇటుకలను కూడా తీసుకువచ్చారు. విశ్వహిందూ పరిషత్ తయారు చేసిన డిజైన్ ప్రకారమే ఆలయాన్ని నిర్మించనున్నారు.

## మరోసారి చిక్కుల్లో మాజీ ఎంపీ రాయపాటి

హైదరాబాద్ : టీడీపీ మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు మరోసారి చిక్కుల్లో పడ్డారు. రాయపాటి హామీదారుడిగా వ్యవహరిస్తున్న ట్రాన్స్‌ట్రాయ్ లిమిటెడ్ ఆస్తుల వేలానికి రంగం సిద్ధమైంది. సెంట్రల్ బ్యాంక్‌కు సుమారు రూ.452.41 కోట్లు ట్రాన్స్‌ట్రాయ్ బకాయి పడింది. కాగా తనఖా పెట్టిన ఆస్తులను ఆగస్టు 18న వేలం వేయనున్నట్లు సెంట్రల్ బ్యాంక్ తెలిపింది. ఈ నేపథ్యంలో బిడ్స్ దాఖలుకు ఆగస్టు 14న చివరి తేది అని ప్రకటించింది. అయితే 2017 జనవరి 9నాటికి సెంట్రల్ బ్యాంక్‌కు చెల్లించాల్సిన మొత్తం 452.41 కోట్లు కాగా, వీటికి హామీదారులుగా ట్రాన్స్‌ట్రాయ్ మాజీ ఎండీ శ్రీధర్, రాయపాటితోపాటు మరో ఐదుగురు ఉన్నారు. ఇదే కాక ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో కెనరా బ్యాంక్‌కు సంబంధించి సుమారు రూ.300 కోట్లు మోసం చేసిన కేసులోనూ రాయపాటిపై సీబీఐ కేసు నమోదైంది. ఈ బకాయిలు మాత్రమే కాకుండా వివిధ బ్యాంకుల ద్వారా రూ.3,694 కోట్ల మేర రుణాలను ట్రాన్స్‌ట్రాయ్ సంస్థ తీసుకుంది.

## అచ్యుతాపురంలో

# జగనన్న పచ్చ తోరణం



అచ్యుతాపురం : ఒకొక్కరు కనీసం 10 మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు

మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని వైసిపి నాయకులు కూండ్రపు వెంకునాయుడు అన్నారు . శనివారం మండల కేంద్రమైన అచ్యుతాపురంలో ఆయన జగనన్న పచ్చ తోరణం కార్యక్రమంలో బాగంగా మొక్కలు నాటారు. అనంతరం గ్రామ ప్రజలకు మొక్కలు పంపిణి చేశారు.

ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ చెట్లను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించు కోవలిసిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు.

# ఎల్జి పాలిమర్స్ కంపెనీని తక్షణమే తరలించాలి : సిఐటియు




విశాఖపట్నం : సౌత్ కొరియా లో 24 జూలై న ఎలక్ట్రానిక్ మీడియాలో ఎల్జీ దుర్ఘటనపై కథనాన్ని టెలికాస్ట్ చేశారు. ఎల్‌జి పాలిమర్స్ యజమాన్యం నిర్లక్ష్యానికి కొరియాలోని మాతృసంస్థ ఎల్‌జి సిహెచ్‌ఎం బాధ్యత వహించాలని ఈ ఈ టెలికాస్ట్ లో చెప్పారు. ఎఎన్ఆర్ఇవి సంస్థ ఆధ్వ ర్యంలో సౌత్ కొరియా లో ఎల్జిపాలిమర్స్ మాతృసంస్థ ఎల్‌జి సిహెచ్‌ఎం విశాఖ ఎల్జి పాలిమర్స్ లో దుర్ఘటనలో చనిపోయినవారికి న్యాయం చేయాలని, వాతావరణం కలుషితం చేసిన ఎల్జి యజమాన్యం పై క్రిమినల్ చార్జెస్ పెట్టాలని ఆందోళన చేస్తున్నారు. యాజమాన్యం నిర్లక్ష్యానికి బలైన ప్రజలు, పశు సంపద, వ్యవసాయం, జలవనరులు రక్షించాలని ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5న విశాఖపట్నంలో సీఐటీయూ తో పాటు కొరియా, జపాన్, యూకే, యూఎస్ఏ, హాంకాంగ్, నేపాల్, శ్రీలంక, పాకిస్తాన్ మొదలగు పది దేశాలలో నిరసన కార్యక్రమం చేశారు. ఒక దుర్ఘటన పై ఇంత పెద్ద ఎత్తున అంతర్జాతీయ సంఘీభావం రావడం సంతోషదాయకం. ఇప్పటికీ కొరియాలోని ఎల్జీ కంపెనీ వద్ద నిరసనలు కొనసాగిస్తున్నారు. ఎల్జి పాలిమర్స్ లో గ్యాస్ లీక్ వల్ల15 మంది చనిపోవడానికి కొరియాలోని ఎల్జీ కంపెనీ యాజమాన్యం బాధ్యత వహించాలని జూలై 14న కొరియాలోని ఎల్‌జి గేటు వద్ద నిరసన తెలిపారు. కొరియాలోని ఎల్జి యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని నినదించారు. మే ఏడోవ తేదీ ఉదయం ఎల్‌జి పాలిమర్స్ నుండి విడుదలైన విషవాయువుల తో 15 మంది మృతి చెందారు, 585 మంది ఆసుపత్రి పాలయ్యారు, ఐదు కిలోమీటర్ల పరిధిలో 20 వేల మందిని తరలించడం జరిగింది. ఈ దుర్ఘటనలో చనిపోయిన మూడు కుటుంబాలకు నేటికీ ప్రభుత్వం నుండి అందవలసిన సహాయ సహకారాలు అందలేదు. అనేక మందికి ప్రభుత్వం ప్రకటించిన కాంపెన్సేషన్ చెల్లించలేదు. ఎల్జి పాలిమర్స్ దుర్ఘటనపై వేసిన హైపవర్ కమిటీ తన రిపోర్టులో ఈ కంపెనీని ఈ ప్రదేశం నుండి తరలించమని సూచించడం జరిగింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైపవర్ కమిటీ సూచనలను పరిగణలోకి తీసుకొని ఎల్జి పాలిమర్స్ కంపెనీని తక్షణమే తరలించాలని, కాంపెన్సేషన్ పే చేయని చనిపోయిన మూడు కుటుంబాల వారికి తక్షణమే కాంపెన్సేషన్ చెల్లించాలని, ప్రభుత్వం ప్రకటించిన విధంగా కాంపెన్సేషన్ చెల్లించకుండా మిగిలిన వారందరికీ కూడా వెంటనే డబ్బులు చెల్లించాలని, ఎల్జీ పాలిమర్స్ పరిధిలో నివాసం ఉంటున్న వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలి,

వారి జీవిత కాలం ఆరోగ్య సంరక్షణకై భరోసా ఇవ్వాలని సిఐటియు డిమాండ్ చేస్తున్నది.

# విజయభాను సంపాదకీయం

## ఆధునిక సాగు అవసరం

కాలంతో పాటు వ్యవసాయ పద్ధతులు మారుతున్నాయి. మోటబావుల వ్యవసాయం నుంచి ఆధునిక డ్రిప్ ఇరిగేషన్ దాకా వచ్చినం. ఎనుకటికి ఎద్దులేని వ్యవసాయం ఉండునా అనుకునేవాళ్లు. కానీ నేడు యంత్రాలు లేని వ్యవసాయాన్ని తలుచుకుంటే కొంత భయమేస్తది. నేడున్న పరిస్థితుల్లో గ్రామాల్లో వ్యవసాయ పనులకు మనుషులు దొరుకడమే కరువైంది. కొన్ని సందర్భాల్లో కోతకు మనుషులు లేక పంటలను కోయలేక వదిలేసిన సందర్భాలున్నాయి. కాబట్టి కాలానుగుణంగా వ్యవసాయరంగంలోనూ విప్లవాత్మక మార్పులతో యాంత్రీకరణ జరుగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.

మాచిన్నప్పుడు వరి కోతకొచ్చింది అంటే అదొక యుద్ధ వాతావరణం ఉండే. కానీ ఇప్పుడు హార్వెస్టర్లు వచ్చి కోతల పని సులభం చేసినవి. అయితే వరికి సంబంధించి ఆధునిక పనిముట్లు కొంత అందుబాటులోకొచ్చాయి కానీ మిగితా పంటలకు, లేదా ఇతర అవసరాలకు మనరైతాంగం ఇంకా ఎనుకటి పాత పద్ధతుల పైనే ఆధారపడాల్సి వస్తున్నది. మనకంటే తక్కువ వ్యవసాయ సాగుభూమి ఉన్న జపాన్, ఇజ్రాయిల్, నెథర్లాండ్స్, జర్మనీ లాంటి దేశాలు ఎక్కువ దిగుబడి సాధిస్తున్నాయి. ఎక్కువ ఎగుమతులు చేస్తున్నాయి. కారణం వారి వ్యవసాయం ఆధునీకరించబడింది. మనం మాత్రం ఇంకా మన తాతలు తండ్రులు చేసిన విధానాలపైనే ఎక్కువగా ఆధారపడుతున్నాం. మన రైతులను ధనికులను చేయాలంటే వ్యవసాయాన్ని సాంకేతికంగా ఆధునీకరించుకోవాలి. ఆధునిక పనిముట్లతో వ్యవసాయం చేయాలి. శాస్త్రీయపద్ధతుల్లో దిగుబడులు పెంచుకోవాలి. అదేవిధంగా మన వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించుకోవాలి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక చాలావరకు వ్యవసాయ సమస్యలు పరిష్కరించుకున్నాం. ముఖ్యంగా నీటి సమస్య, గోడౌన్ లు, రైతులకు రైతుబంధుద్వారా పెట్టుబడి, ప్రతి ఐదు వేళ ఎకరాలకు ఒక వ్యవసాయ అధికారి లాంటి వాటితో అనేక సమస్య లను పరిష్కరించుకున్నాం. ఇక ఇప్పుడు మనముందు ఉన్న తక్షణ కర్తవ్యం వ్యవసాయాన్ని ఆధునీకరించుకోవడం.

రైతుల ఆదాయం పెరిగి వారి జీవనం అభివృద్ధి చెందాలంటే వ్యవసాయ ఖర్చులు తగ్గాలి. సాంకేతిక పద్ధతుల్లో ఆధునిక పనిముట్లతో వ్యవసాయం చేస్తే పెట్టుబడులు గణనీయంగా తగ్గించు కోవచ్చు. పత్తి తీసుడైనా, మిరప తోట ఎరుడైనా, చేనుకు మందుకొట్టే డ్రోన్ల సాయంతో ఎడ్లను, మనుషులను పక్కనపెట్టి మెషీన్లతో మాత్రమే వ్యవసాయంచేయాలి. ప్రతి పనికి ఒకయంత్రం ఉన్నది. కానీ మనకు తెలువదు. ఒకవేళ తెలిసినా వాటిని కొనే స్థోమత మన రైతులకు లేదు. ఎందుకంటే దేశంలో ఎక్కువశాతం రైతులు రెండు ఎకురాల చిన్న రైతులు కావటమే.

దేశంలో, రాష్ట్రంలో మెజారిటీగా ఉన్న చిన్న, సన్నకారు రైతులు ఎలాంటి యంత్రాలను కొనలేరు. మన రైతుల ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఈ ఆధునిక పనిముట్లను తక్కువ ధరకు అంటే సబ్సిడీలతో రైతులకు అందుబాటులో ఉండేలా చేయాలి. ప్రైవేట్ లేదా ప్రభుత్వ సంస్థల ద్వారా రైతులకు కావాల్సిన ఆధునిక పనిముట్లను కిరాయికి ఇచ్చే సంస్థ లను ప్రోత్సహిస్తే, ప్రభుత్వం మీద భారం తగ్గుతుంది. తద్వారా రైతుల వ్యవసాయ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. కొందరు రైతుల దగ్గర ట్రాక్టర్లు, టిల్లర్లు ఉన్నా, అవి పాతబడి పోతే వాటితో లాభం ఉండదు. మార్కెట్లో ఆ పాత వాటికన్నా శక్తివంతమైన యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. కాబట్టి ప్రభు త్వం వీరికి సబ్సిడీతో కొత్త యంత్రాలు ఇస్తే రైతులకు లాభసాటిగా ఉంటది.

అధిక దిగుబడులు సాధించాలంటే పనిముట్లను ఆధునీకరించుకున్నట్లే, వ్యవసాయ విధానాలను శాస్త్రీయ పద్ధతులతో మార్చుకోవాలి.ముఖ్యంగా ఆధునిక పనిముట్లను ఎలా వాడాలి, భూసార పరీక్షలు, శాస్త్రీయంగా వ్యవసాయం ఎలా చేయాలి అని రైతులకు వాల్తమ్ లాంటి సంస్థలతో 'స్కిల్ డెవలప్ మెంట్' శిక్షణ అందివ్వాలి.

ఓకే పంట ఏప్పటికీ వేయడం వలన పంట దిగుబడి తగ్గిపోతుందన్న విషయం రైతులకు కూడా తెలుసు. అయితే ఏ పంట వేయాలి? ఆ పంటకు రేటెంత ఉంటది అని ఎవరు చెప్పాలి? పంట మార్పిడి విషయంలో రైతులకు అనేక ప్రశ్నలు ఉంటా యి. అభివృద్ధిచెందిన దేశాల్లో రైతులకు క్రాప్ డేటా అందుబాటులో ఉంటది. దాంతో ఏ పంటకు డిమాండు ఉంటె ఆ పంట వేస్తారు. మన దగ్గర కూడా అగ్రికల్చర్ ఆఫీస్లద్వారా ఏ పంటవేయాలో, లాభసాటిగా ఏది ఉంటదో రైతుసంక్షేమ సంఘాల ద్వారా, వ్యవసాయ అధికారుల ద్వారా తెలియచేయాలి. దాంతో రైతు ఆలోచనా విధానం మారి, లాభాల వైపు ఆలోచిస్తాడు. కొత్తపంటలు వేసి అధికదిగుబడులు సాధిస్తాడు. ఇలా మనం మనవ్యవసాయాన్ని ఆధునీకరించుకొని శాస్త్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తే అతికొద్దికాలంలోనే తెలంగాణ 'ఫార్మర్స్ రిచ్ స్టేట్' గా ఆవిర్భవిస్తుంది.

## టైటిల్ ఎవరిదైనా జోష్ మాత్రం తగ్గదు: గంభీర్



ఢిల్లీ: ఐపీఎల్-2020 అన్ని సీజన్లోకి హైలైట్‌గా నిలుస్తుందని మాజీ క్రికెటర్, ఎంపీ గౌతమ్ గంభీర్ అన్నారు. ఈ ఐపీఎల్‌లో ఏ జట్టు టైటిల్ సాధిస్తుంది, ఏ ఆటగాడు బాగా ఆటతాడు అనే విషయానికి అంతగా ప్రాధాన్యం ఉండకపోవచ్చని అభిప్రాయపడ్డారు. దేశం, యావత్ ప్రపంచం కరోనా భయాలు నెలకొన్న నేపథ్యంలో జరుగుతున్న క్రికెట్ వేడుక కాబట్టి వేదిక ఎక్కడైనా జోష్ మాత్రం తగ్గదని అన్నారు. ఇక ఐపీఎల్-2020 యూఏఈలో నిర్వహించడం కూడా కలిసి వస్తుందని చెప్పారు. యూఏఈ క్రికెట్ టోర్నీలకు అద్భుతమైన వేదిక అని పేర్కొన్నారు.

ఈ సీజన్ జాతి మూడ్‌ను మారుస్తుందని గంభీర్ ఆకాక్షించారు. ఇక మార్చి 29న నిర్వహించాల్సిన ఐపీఎల్-2020 కరోనా కారణంగా వాయిదా పడుతూ వస్తున్న సంగతి తెలిసిందే. ఇదే సమయంలో అక్టోబర్-నవంబర్‌లో ఆస్ట్రేలియాలో జరగాల్సిన టీ20 ప్రపంచకప్ వాయిదా పడటంతో.. ఆ సమమాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీసీసీఐ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఐపీఎల్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. సెప్టెంబర్ 19 నుంచి నవంబర్ 10 వరకు తాజా ఐపీఎల్ కొనసాగనుంది.

ఇక ఐపీఎల్-2020 ని యూఏఈలో నిర్వహిస్తామని ఐపీఎల్ నిర్వహణ కమిటీ చైర్మన్ బ్రిజేష్ పటేల్ ఇదివరకే ప్రకటించారు. టోర్నీకి సంబంధించి పూర్తి వివరాలు వచ్చేవారం వెల్లడికానున్నాయి. కాగా, గంభీర్ సారథ్యంలో కోల్‌కత నైట్ రైడర్స్ రెండు సార్లు ఐపీఎల్ టైటిల్ సాధించిన సంగతి తెలిసిందే.

## మధ్యప్రదేశ్ సీఎంకు కరోనా పాజిటివ్



భోపాల్: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు కరోనా పాజిటివ్ వచ్చింది. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. 'ప్రజలారా! నాలో కరోనా లక్షణాలు కనిపించడంతో పరీక్షలు చేయించుకున్నా. ఆ పరీక్షల్లో నాకు కరోనా పాజిటివ్‌గా తేలింది. కాబట్టి ఈ మధ్య నన్ను కలిసిన సహచరులందరూ కరోనా నిర్ధారణ పరీక్షలు చేయించుకోండి. నాతో సన్నిహితంగా మెలిగినవాళ్లు తప్పనిసరిగా క్వారెంటైన్‌లో ఉండండి' అని శివరాజ్‌సింగ్ కోరారు.మార్చి 25 నుంచి ప్రతిరోజు సాయంత్రం తాను రాష్ట్రంలో కరోనా పరిస్థితిపై సమీక్ష జరుపుతున్నానని, ఇప్పుడు కూడా సాధ్యమైనంతవరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాల్లో పాల్గొంటానని శివరాజ్‌సింగ్ చెప్పారు. తాను లేకపోయినా, హోంమంత్రి నరోత్తమ్ మిశ్రా, గ్రామీణాభివృద్ధి, పరిపాలనా శాఖ మంత్రి భూపేంద్రసింగ్, ఆరోగ్య విద్యామంత్రి విశ్వాస్ సారంగ్, ఆరోగ్యమంత్రి ప్రభురామ్ చౌదరి సమీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

## చరిత్రలోనే మొదటిసారి ఆన్‌లైన్ దర్శనం



ఉజ్జయిని: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నాగచంద్రేశ్వర్ ఆలయంలో నాగుల పంచమి సందర్భంగా భక్తులకు చరిత్రలోనే మొదటిసారి ఆన్‌లైన్ ద్వారా దర్శనం చేసుకునే సౌకర్యాన్ని కల్పించారు. కొవిడ్ -19 నేపథ్యంలో ఆలయ కమిటీ ఈ ఏర్పాట్లు చేసింది. 'ఈ ఆలయం తలుపులు సంవత్సరానికి ఒకసారి మాత్రమే తెరుచుకుంటాయి. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ఈ ఆలయాన్ని సందర్శిస్తారు. అయితే, ఈ ఏడాది కరోనావైరస్ కారణంగా అది సాధ్యం కాలేదు.' అని ఆలయ పూజారి చెప్పారు. సంప్రదాయాల ప్రకారం పూజలు నిర్వహించామని, 24 గంటలు ఆన్‌లైన్ దర్శనాలు కొనసాగుతాయన్నారు. కరోనావైరస్ నుంచి బయటపడాలని, మళ్లీ సాధారణ స్థితికి రావాలని ప్రార్థించినట్లు పూజారి వెల్లడించారు. ఈ రోజు మధ్యాహ్నం 12:00 గంటలకు మొదలైన పూజలు రాత్రి 12:00 గంటల వరకు కొనసాగుతాయన్నారు.

ఈ సమయంలో ఆన్‌లైన్ దర్శనానికి ప్రజలకు అనుమతి ఉందని, పూజల అనంతరం గుడి తలుపులు మూసివేస్తామని పేర్కొన్నారు. మానవులు, ప్రకృతి మధ్య బంధాన్ని బలోపేతం చేసే పండుగగా నాగుల పంచమిని పరిగణిస్తారని తెలిపారు.

## తమిళనాడులో ఒక్కరోజే 7వేల కరోనా కేసులు

చెన్నై: తమిళనాడులో కరోనా మహమ్మారి అంతకంతకూ విజృంభిస్తోంది. రాష్ట్రంలో కరోనా బాధితుల సంఖ్య 2లక్షలు దాటింది. ఇవాళ ఒక్కరోజే 6,988 పాజిటివ్ కేసులు నమోదైనట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. గడచిన 24 గంటల్లో కరోనా వల్ల 89 మంది మృతిచెందారు. రాష్ట్రంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 2,06,737కు చేరింది. ఇప్పటి వరకు 1,51,055మంది కోలుకున్నారు.

కరోనా బారినపడి 3,409 మంది మరణించారు. ప్రస్తుతం 52,273 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో కరోనా తీవ్రత తమిళనాడులోనే ఎక్కువగా ఉన్నది.

## సమకవి సమయం

### సూర్యదేవ దండం

శిరస్సొంచి మొక్కేము సూరుడుకి
సరస్సులో గంగతో - దోసెళ్ళు నీళ్ళతో
దయ సూపవయ్య స్వామి
క్వారీ కొండల్లో - రాళ్ళ బరువు పనివున్నా?
కందకాలు తవ్వుల్లో - గునపాలు చేతున్నా?
బుగ్గి, బురదల్లో - ఒడలిరగ శ్రమగున్నా?
తోడు, నీడ - నీదేనయ్యా...
పనిలో మునిగితే - వేళ్ళెంటో తెలియదు
పగలంత వెలుగుతో - పనితలపే వుండును
వెలుతురు సోకి - శ్రమలే వేగం
పనిలో చేతులు - శ్రమకే భాగం.
గమ్మెత్తు గున్నది - ఈ పొద్దు పొద్దా...
గుంకుపోతున్నావా - పొద్దంత వెలుగుతో...
పొద్దు మునిగేవరకు - ముద్దుల పొద్దా...
పొద్దల్ల పాటుతో - మాసద్దా...
పుడమి నందు పుట్టాము - శ్రమ కోరి
శ్రమలుతోను - పుణ్యానికేగి
సట్టెలతో సల్లంది - ఉట్టెలతో పట్టుకొని
పొద్దుటేళ గూడిడిచి - బయవెళ్ళేము
మల, మల - ఎండలోన
చెమటలతో - ఎంతైన
తప్పదు సుమా...
ఈ పాటు?
నడుమను సుమా...
మా తోటు?
ఎగుడు, దిగుడు కొండైనా...
బండ బరువు లావైనా...
పనిభారం - మాదే కాదా?
సూర్యస్వామి...
సూర్య దేవ...

...కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు

## పంచాంగం

మాసం : శ్రావణ ; తిథి : షష్ఠి ప.12.01; హస్త ప.3.45; రా.వ.11.10ల 12.38.

ఆదివారం 26-07-2020

**మేషం** : మీ వాగ్ధాటి, నిజాయితీలు ఎదుటివారిని ఆకట్టు కుంటాయి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచిది కాదు. ప్రచార సాధనాలు, రవాణా రంగాల్లో మీ పెట్టుబడులు సత్ఫలితాల నిస్తాయి.

**వృషభం** :బంధు మిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. మీ శ్రీమతి సలహా పాటించడం వల్ల ప్రయోజనం ఉంటుంది. దీర్ఘకాలికంగా ఆగిపోయిన ధనం చేతికి వస్తుంది. లక్ష్య సాధనపై దృష్టి పెట్టడానికి సరైన సమయం. స్థిరాస్తుల అభివృద్ధి, కొనుగోలు యత్నాల విషయాలలో పునరాలోచన అవసరం.

**మిథునం** :ఆర్థిక పరిస్థితి నిరాశ పరుస్తుంది. వృత్తి, వ్యాపారాలు సజావుగా సాగుతాయి. దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. బంధు మిత్రుల నుంచి విమర్శలు ఎదుర్కొంటారు.

**కర్కాటకం** : మీ సంతానంతో ఉల్లాసంగా గడుపుతారు. నిరుద్యోగలకు ఇంట ర్వ్యూలలో మెళుకవ అవసరం. ఖర్చులు అధిక మవుతాయి. **సింహం** :ఆత్మీ యుల మధ్య కానుకలు పరస్పరం ఇచ్చిపుచ్చు కుంటారు. నూతన వ్యాపా రాలలో గణనీయమైన పురోభివృద్ధి సాధిస్తారు. అవగాహన లేని విషయాలకు దూరంగా ఉంటే మంచిది. దంపతుల మధ్య కొత్తకొత్త విషయాలు చర్చకు వస్తాయి. స్త్రీలకు పరిచయాలు, వ్యాపకాలు అధిక మవుతాయి.

**కన్య** : వ్యాపారాల్లో గణనీయమైన పురోభివృద్ధి సాధిస్తారు. నిరుద్యో గులు ఇంటర్వ్యూల్లో రాణిస్తారు. మీ శ్రమకు తగిన గుర్తింపు, ప్రతిఫలం లభిస్తాయి. మీ మాటకు ఇంటా బయటా ఆదరణ పెరుగుతుంది.

**తుల** : నూతన పరిచయాలు, సంబంధ బాంధవ్యాలు మీ పురో భివృద్ధికి ఎంతగానో సహకరిస్తాయి. వృత్తి వ్యాపారాలలో ఆటంకాలను అధిక మిస్తారు. స్త్రీలకు ఆరోగ్యంలో మెళకువ అవసరం. నిరుద్యోగులకు అశా జనకం.

**వృశ్చికం** : స్త్రీలు పని దృష్ట్యా ఒత్తిడి, చికాకులకు ఎదు ర్కొంటారు. ఏ విషయంపై అయినా స్పందించే ముందు పరిణామాలు ఎలా ఉంటాయో మరొక్క సారి ఆలోచించండి. నిరుద్యోగులు నిరాశ, నిస్పృహలకు లోనవు తారు.

**ధనుస్సు** : స్త్రీలు, గృహోపకరణాలకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తారు. **మకరం** : మీ అభిప్రాయాలకు తగిన వ్యక్తితో పరిచయా లేర్పడతాయి. స్వయంకృషితో వ్యాపారాలలో బాగా రాణిస్తారు.

**కుంభం** : వృత్తి కళా రంగాలలో మీ ప్రాధాన్యత అధికమవుతుంది. అనుకోని మార్పులు ఏర్పడటంతో రోజువారీ మీ కార్య క్రమాలు సకాలంలో జరుగక అసహనం పెరుగుతుంది.

**మీనం** : ఇంటా బయటా కూడా తలపెట్టుకున్న పనులకు ఆటంకాలు తప్పక పోవచ్చు. స్థిర చరాస్తుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తారు. చేపట్టిన పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కొంటారు. మీ వాహనం ఇతరులకిచ్చి ఇబ్బందు లెదుర్కొంటారు.

## రసరమ్యం...రాఘవేంద్ర చరితం

### సంకీర్తన

శ్రీరాఘవేంద్రులు జ్ఞాన సంపన్నుడు, సిద్ధ పురుషుడు. పిలిస్తే పలికే ప్రత్యక్ష దైవం. మంత్రాలయంలోని బృందావన సన్నిధానంలో భక్తులు పొందే శాంతి సంతృప్తుల మాటల కందనివి. అలజడి, అశాంతి, ఆందోళనలతో నిండిన నేటి కుహనా నాగరిక సమాజానికి అటువంటి సత్పురుషుల సాహిత్యం, సాన్నిహిత్యం, సాన్నిధ్యం ఎంతో అవసరం. అది నిరంతరం వెలిగే అఖండ జ్యోతి. ఈ చిన్న శ్లోకం శ్రీ రాఘవేంద్రుల వ్యక్తిత్వాన్ని దైవత్వాన్ని శక్తిమత్త్వాన్ని సూచిస్తుంది.

**ఆరాధ్యదైవం**

మధ్వ సాంప్రదాయంలో ఆధ్యాత్మికంగా అత్యున్నత స్థాయికి చెందిన యతివరేణ్యుడు శ్రీ రాఘవేంద్రస్వామి. నిత్య సత్య చైతన్యమూర్తి. భౌతికంగా కనిపించకపోయనా తన దివ్య మహిమలతో, లీలలతో ఆశ్రీత భక్తకోటికి దయామయుడుగా ఆపద్బాంధవుడుగా, రక్షకుడుగా ఆరాధ్య దైవమైనాడు. శ్రీ రాఘవేంద్రస్వామి పీఠాధిపత్యం వహించిన తర్వాత అంతవరకు సమతీంద్ర మఠంగా ఉన్నది రాయ మఠంగా మార్పుచెందింది. గత జన్మలలో దేవతాగణంలో శంకువరుణుడనీ, తదుపరి భక్తప్రహ్లాదుడనీ, ఇటీవలి కాలంలో వ్యాసరాయలనీ శ్రీ రాఘవేంద్రుని గురించి మధ్వ సంప్రదాయం విశ్వాస పూర్వకంగా భావిస్తుంది. దానిని కర్నాటక హరిదాస సంప్ర దాయం కూడా సమర్థిస్తుంది.మధ్వ గురుపరంలో శ్రీరాఘ వేంద్రులది విశిష్టస్థానం. జీవసమాధి చెంది మూడువందల ఏళ్లు దాటినప్పటికీ ఆయన శక్తి ప్రభావం నిత్య నూతనంగా వర్ధిల్లుతున్నదనడానికి నిరంతరాయంగా భక్తి ప్రపత్తులతో బృందావన దర్శనానికి వస్తున్న అపార జన సందోహమే సాక్ష్యం.పేదరికంతో మగ్గిన స్వామి శ్రీ రాఘవేంద్రస్వామి 1571లో కాంచీపురం సమీపం లోని భువనగిరిలో నిరుపేద కుటుంబంలో పవిత్రవర్తనులైన తిమ్మన్నభట్టు, గోపికాంబ దంపతులకు జన్మించాడు. తల్లిదండ్రులుపెట్టిన పేరు వెంకట నాధుడు. వీరి తాతగారు శ్రీకృష్ణదేవరాయల ఆస్థాన వైణికుడిగా వుండేవారు. వెంకటనాథుడి బాల్యంలోనే తల్లిదండ్రులు గతించారు. బావగారైన లక్ష్మీనారాయణ చేరదీశాడు. బావగారి పెంపకంలోనే వెంకటనాథుడు సర్వశాస్త్ర పారంగతుడయ్యాడు. యుక్తవయసు రాగానే సరస్వతి అనే కన్యతో వివాహమైంది. ఓ పిల్లవాడు కూడా పుట్టాడు. కాని వెంకటనాధునికి దరిద్రం దావాలనంలా చుట్టుముట్టింది. ఆదుకునేవారెవరు లేరు. నిస్సహాయ స్థితిలో వెంకటనాధుడు భార్యాబిడ్డలతో కలిసి కుంభకోణం చేరుకున్నాడు. అనూహ్యంగా అక్కడ తాత్కాలికంగా బసచేసిన సుధీంద్ర తీర్థులవారి ఆశ్రయం లభించింది.

సుధీంద్రుడు కొత్త శిష్యుడైన వెంకట నాధుని ఎంతో ప్రేమగా ఆదరించాడు. శిష్యుని అసమాన్య ప్రజ్ఞాపాటవాలకు ఆశ్చర్యపోయాడు. అతని మేథాశక్తిని, శాస్త్ర జ్ఞాన ప్రావీణ్యాన్ని అభినందిం చకుండా ఉండలేకపోయాడు. జ్ఞాన వరిష్టుడైన వెంకటనాధుని వినయ విధేయతలు చిత్తశుద్ధీ గురువైన సుధీంద్ర యతీంద్రులను బాగా ఆకర్షించాయి.వయోభారంతో వున్న సుధీంద్రులు శిష్యుడైన వెంకటనాధుని ఒకరోజు చేరపిలిచి వెంకట నాథా! నేను వృద్ధాప్యంలో ఉన్నాను. ఈ శరీరం నేడోరేపో అన్నట్టుగా ఉంది. రామచంద్రమూర్తి ఆరాధన నిరంతరాయంగా కొనాగించేందుకు నా తర్వాత ఈ పీఠాధిపత్యం నీవు వహించాలి అని తన మనసులోని కోరికను బయట పెట్టాడు. తకు భార్యాబిడ్డలున్నారని కుటుంబ పోషణ చేసి వారిని సుఖపెట్టడం తన బాధ్యత అని తన అశక్తతను వెల్లడించాడు వెంకటనాథుడు. గురువుగారి కోరికను తీర్చలేకపోతున్నందుకు వ్యాకులపడుతూ ఇంటికి చేరు కున్నాడు. భార్యకేమీ చెప్పలేదు.




# మహాప్రభో స్మశానవాటిక ఆక్రమణకు గురికాకుండా కాపాడండి

## తహశీల్దార్‌కు వైసీపీ నాయకులు బొద్దపు వినతి

పరవాడ: పరవాడ మండలము ఈదులపాక బోనంగి పంచాయితీ పరిధిలో గల బొద్దపు వాని పాలెంలో గ్రామంలో సర్వేనెంబర్ 210/4 లో సుమారు 36సెంట్లు స్మశానవాటికను కొందరు అక్రమించు కున్నారని వారిపై చర్యలు తీసుకోవాలనీ బొద్దపువానిపాలెం వైసీపీ నాయకులు బొద్దపుచిన్నారావు శని వారము తహశీల్దార్ పి.వి.ఎల్.ఎన్.గంగాధర్ రావు కువినతిపత్రం అందజేసారు. అనం తరము అయన స్దానిక విలేఖర్లుతో మాట్లా డుతూ స్మశానవాటిక అక్రమణ విషయం గతంలో స్దానిక తహ శీల్దార్ కు,అర్డీఒకు, కలెక్టర్ కు వినతి పత్రాలు అందజేశాము అన్నారు. అధి కారులు దీనిపై స్పందించి మండల సర్వే యర్ ను పంపించిసర్వేచేసి స్మశాన వాటి కను అక్రమించినవారిపై చర్యలు తీసుకోవా లని వైసీపీ నాయకులు బొద్దపు చిన్నారావు కోరారు.



# హెరిటేజ్ పాడి రైతులకు భీమా పంపిణీ



అచ్యుతాపురం : హెరిటేజ్ పాడిరైతుల సంక్షేమం కోసం హెరిటేజ్ డెయిరీ కృషి చేస్తుందని అచ్యుతాపురం శాఖ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు. మండలంలో రామన్నపాలెం గ్రామంలో డెయిరీకి పాలు పోసే పాడిరైతుల పాడి పశువులు మృతి చెందడంతో ధర్మిరెడ్డి సత్యం కు రూ .50 వేలు, రెడ్డి దేముడుకు రూ. 40 వేలు మేనేజర్ శేషు శనివారం పంపిణి చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిరైతులకు భీమా సదుపాయం, వారి పిల్లలకు ఉపకార వేతనాలు అందిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ చినరాము , డి రాము, డి కిశోర్, ఆర్ ప్రసాద్, డి.లక్ష్మి తదితర పాడిరైతులు పాల్గొన్నారు.

# ఆంధ్ర విశ్వకళా పరిషత్ నూతన రెక్టార్‌గా

## మహిళకు దక్కిన గౌరవం



విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయానికి నూతన రెక్టార్ గా పదవి బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఆచార్యులు కె. సమతని, వైయస్ఆర్ విద్యార్థి విభాగం కలిసి శుభాకాంక్షలు తెలియ జేసినారు. విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి పాలనలో మహిళలకు 50% అమలు చేసి సముచిత స్థానం కల్పించడం హర్షించదగిన పరిణామం. ఈ కార్యక్రమంలో...

ఏయు అధ్యక్షుడు, బి.మోహన్‌బాబు, రాష్ట్ర కార్యదర్శులు ఎం.సురేష్, ఎం. కళ్యాణ్, విద్యార్థి నాయకులు నిషేక్, సంజయ్, ఆశిష్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ సబ్సిడీలను వినియోగించుకోవాలి



దేవరాపల్లి : రైతు భరోసా కేంద్రాలు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులు వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ జెడిఏ జిఎస్ఎస్ఎన్.లీలావతి అన్నారు. మండలంలోని ఏ.కొత్తపల్లి గ్రామంలో శనివారం జరిగిన కౌలురైతు గుర్తింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రైతులు అందరూ గ్రామంలో రైతు భరోసా కేంద్రాలలో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీలో ఇస్తున్న ఎరువుల, పురుగు మందుల, విత్తనాలు తీసుకొవాలని కోరారు. రైతులు పండించిన పంటలు నమోదు కార్యక్రమంలో పాల్గొని అన్ని పంటలును ఈ-పంట లో నమోదు చేసుకోవాలన్నారు. కౌలు రైతులు అందరూ కౌలు కార్డు పొందేందుకు కావాల్సిన పత్రాలు వి ఆర్ ఓ కు ఇచ్చి, ప్రభుత్వ రాయితీలు పొందాలన్నారు.

ఈ కార్యక్రమంలో...

మండల వ్యవసాయ అధికారి ఎం. వాసుదేవరావు, వి.ఆర్.ఓ శేఖర్, హేమ, వైఎస్సార్ సి పి నాయ కులు చింతా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు సత్యదేవుని ఆలయంలో

# కర్ఫ్యూ కారణంగా భక్తులకు దర్శనములు నిరాకరణ



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో జిల్లా కలెక్టర్ వారి ఉత్తర్వుల మేరకు 5/4/2020, తేదీ.18.07. 2020 ప్రకారము ప్రతి ఆదివారం కర్ఫ్యూ విదించిన కారణంగా తదుపరి ఉత్త ర్వులు వచ్చేవరకు భక్తులను ఎవరిని ఆలయ మునకు అనుమతించ కుండా శ్రీ స్వామివారికి నిర్వహించవలసిన కార్య క్రమాలన్నీ ఏకాంతంగా శాస్త్ర ప్రకారంగా నిర్వహించబడును. తదుపరి సోమవారం నుండి శనివారము వరకు భక్తులకు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు శ్రీ స్వామి వారి దేవస్థానము నకు అనుమతించబడును.శ్రీ స్వామివారి దేవస్థానం నందు నిర్వహించు అర్జిత సేవలు (వ్రతములు, స్వామి వారి నిత్య కళ్యాణం, ఆయుష్ హెూమము,చండీ హెూమము) మొదలగు సేవలు యందు భక్తులు ప్రత్యక్షంగా పాల్గొని సదరు సేవలను నిర్వహించు కొనవచ్చును. కావున భక్తులు గ్రామస్థులు సహక రించవలసినదిగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు కోరారు.

## చీడికాడలో భారీగా

# నాటుసారా పులుపు ధ్వంసం

### - తయారీదారులు పరార్



చీడికాడ / దేవరాపల్లి : నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన వెయ్యి లీటర్ల పులుపును స్థానిక పోలీసులు ధ్వంసం చేశారు. ఎస్ఐ ఎల్. సురేష్ కుమార్ శనివారం విలేకరులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చీడికాడ గ్రామ శివారు రాజుగారి కల్లాల ఆవలివైపు నాటు సారా తయారీ చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు తన సిబ్బందితో దాడి చేయడం జరిగిందన్నారు.

నాటు సారా తయారీ సిద్ధంగా ఉంచిన సుమారు 1000 లీటర్ల బెల్లం పులుపునూ ధ్వంసం చేసి అక్కడ ఉన్నా 2 బెల్లం దిమ్మలను స్వాధీనపరుచుకున్నమని తెలిపారు. తయారీదారుల కోసం దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఈ దాడిలో ఏఎస్ఐ నాగేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ లు గోవింద్, జ్వాలాముఖి,సత్యనారాయణ, కానిస్టేబుల్ శ్రావణ్, అశోక్,గోపాల్ పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న పశువుల వ్యాన్ పట్టివేత



పట్టుబడిన పశువుల వ్యాన్

గొలుగొండ : గొలుగొండ మండలం చీడిగుమ్మల గ్రామ సమీపంలో సుమారు 20 పశువులను అక్రమంగా తరలిస్తున్న వ్యానును బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాదె శ్రీనివాసరావు పట్టుకున్నారు. వ్యాన్‌లో సభ్యులని వివరాలు అడగగా పొంతన లేని సమాధానం చెప్పడంతో గొలుగొండ పోలీస్‌స్టేషన్‌కి సమాచారం అందించి తానే స్వయంగా పోలీస్ వారికి వ్యానును అప్పగించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ పోలీస్ వారు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని వివరించారు.

ప్రస్తుతం ఈ ఇరవై పశువులను కొత్తపట్నం గోసంరక్షణ కేంద్రానికి తరిలించి కేసు పూర్తయ్యే వరకు వాటి సంరక్షణ బాధ్యతలు తానే పర్యవేక్షణ చేస్తానని తెలిపారు.

# శిరోముండనం ముద్దాయిలను వెంటనే అరెస్ట్ చేయాలి



అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం స్దానిక రావిచెట్టు సెంటర్ నందు ఉన్న డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ముందు ఇటీవల దళితులపై జరుగుతున్న వరుస దాడులకు నిరసనగా జిల్లా మాల నాయకులు ఇచ్చిన పిలుపుమేరకు క్రొవ్వొత్తుల ప్రదర్శన చేసారు. ఇటీవల చీరాల లో కిరణ్ కుమార్ ను హత్య చేసిన ఎస్సై ను 302 కింద వెంటనే అరెస్ట్ చేయాలని, బాలికను సామూహికంగా అత్యాచారం కేస్ లో దిశ చట్టం పెట్టాలని ఈ మూడు కేస్ ల మీద సిట్టింగ్ హైకోర్టు జడ్జి తో విచారణ జరిపించి నష్ట పరిహారం కింద కిరణ్ కుమార్ కుటుంబానికి కోటి రూపాయలు, అమ్మాయికి, శిరోముండనం గావింపబడ్డ వర ప్రసాద్ కు 50 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో నాయ కులు సరమర్ల. మధుబాబు,రాయి.శ్రీనివాస్, తాడి.సింహాచలం, యినకోటి. వీరబాబు,తాడి.యేసు,తాడి. శ్రీనివాస్,చింతాడ.అర్జున్ మరియు అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శిపై విచారణ

గొలుగొండ : గొలుగొండ మండలం సీతకండి గ్రామస్తుల మైనింగ్ ఆవేదనకై శనివారం గొలుగొండ మండల పరిషత్ కార్యాలయంలో ఏటి గైరంపేట పంచాయతీ కార్యదర్శి పై, సీతకండి మైనింగ్ కోరిపై విచా రణ చేపట్టారు. మండల ఈవో సీతయ్య, పంచాయతీ ప్రత్యేక అధి కారి మధుసూదన్ ఉదయం నుంచి పంచాయతీ రికార్డ్ పత్రా లను పరిశీ లించడం జరిగింది. పంచాయతీ కార్యదర్శి నుంచి జరిగిన విషయం పై విచారణ చేపట్టారు.



విచారణ చేస్తున్న దృశ్యం

# సిఎం జగన్ దృష్టికి తాడి తరలింపు

## ఎమ్మెల్యే అధీప్‌కు కృతజ్ఞతలు తెలిపిన గోవింద్



పరవాడ: కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామం తరలింపు విషయం ముఖ్య మంత్రి జగన్‌మొహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళిన పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డిఅదీప్ రాజ్ కు తాడివైసిపికన్వీనర్ గోవిందరాజు (తాడి గోవింద్) కృతజ్ఞతలు తెలిపారు. అనంత రము అయన విజయభాను ప్రతినిది తో మాట్లడుతూ స్దానిక ఎమ్మేల్యేఅదీప్ రాజ్ పాదయాత్రలో ఇచ్చిన హమీ మేరకు తాడి గ్రామాన్నితరలించడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారు అన్నారు. పలుమార్లు అసెంబ్లీలో తాడితరలింపు విషయంపై గర్జించిన ఘనత ఎమ్మేల్యే అదీప్ కేదక్కిందిఅన్నారు.

ముఖ్య మంత్రి జగన్ మొహన్ రెడ్డి దీనిపై సాను కూలంగా స్పందించి త్వరలోనే తాడి తరలింపుకు చర్యలు చేపడుతామని హమీ ఇచ్చారు అని అయన తెలిపారు.

# పుదుచ్ఛేరిలో పదివేల కరోనా రోగుల కు బెడ్లు ఏర్పాటు

## - ఆరోగ్య మంత్రి మల్లాడి



యానాం : కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో రానున్న 35 రోజుల్లో వేలకొలది పాజిటివ్ కేసులు పెరుగు నున్న నేపథ్యంలో వైరస్ సోకిన రోగుల కొరకు పదివేల బెడ్లు ఆయా ప్రాంతాలలో ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు తెలిపారు. శనివారం పుదుచ్చేరిలోని మంత్రి కార్యాలయంలో ఆయన గత 24 గంటల హెల్త్ బులిటెన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విషయమై ముఖ్యమంత్రి వీ నారాయణస్వామి తో హెల్త్ సెక్రటరీ ,డైరెక్టర్ ,కలెక్టర్ ,నేను సమావేశమై చర్చించినట్లు తెలిపారు .కనీసం ఆరు వేల బెడ్లు కొరకు ఐ జి ఎం సి ,జిప్మెర్ ,వైద్య కళాశాలలు ,ప్రైవేట్ కళాశాలలు ,కల్యాణ మండపములు తదితర వాటిని ఈ బెడ్లు కొరకు వినియోగించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు .గత నాలుగు నెలలుగా వైద్య సిబ్బంది రాత్రింబగళ్ళు ఎంతో కష్టపడి పని చేస్తున్నారని కేసులు పెరిగితే సిబ్బందిని కూడా పెంచాలని ,ఎక్విప్మెంట్స్ పెంచాలని ,మెడిసిన్ తదితర వాటిని కూడా పెంచే విధంగా ఇటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకునేందుకు ముఖ్యమంత్రితో చర్చించి నట్లు తెలిపారు .పుదుచ్చేరి వ్యాప్తంగా ఎప్పటి వరకు 34 వేల 305 వైరస్ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు తెలిపారు గత 24 గంటల్లో 775 మందికి నిర్ధారణ పరీక్షలు చేయగా 139 మందికి వైరస్ సోకినట్లు నిర్ధారణ అయిందని, ముగ్గురు మరణించినట్లు తెలిపారు. 1055 మంది నాలుగు ప్రాంతాల్లో వైరస్ సోకితే చికిత్స పొందుతున్నారని, 1261 మంది ఇప్పటివరకు వైరస్ బారి నుండి అయ్యా ఆసుపత్రి నుండి కోలుకొని డిశ్చార్జ్ అయినట్లు తెలిపారు .పుదుచ్చేరి అసెంబ్లీ లో ఎమ్మెల్యేకు వైరస్ సోకిందని అసెంబ్లీ కార్యాలయాన్ని మోసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే తో కనెక్టింగ్ అయిన ఇతర ఎమ్మెల్యేలు ,మీడియా ఇతర సిబ్బందికి కరోనా నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు ప్రభుత్వం.వైద్య సిబ్బంది, ఇతర అధికారులు ఎవరైనను నివారణ చర్యలు చేపట్టిన ప్రజల సహకారం లేకపోతే వైరస్ ను నివారించడం కష్టమన్నారు.

అందువలన ప్రజలందరూ వైరస్ నివారణ చర్యలు పాటించి ప్రభుత్వ అధికారు లకు, ఇతర సిబ్బందికి సహకరించాలన్నారు. నివారణ చర్యలు కొరకు అన్ని ఏర్పాట్లు చేయ నున్నట్లు తెలిపారు.

# ఘనంగా శ్రీ సత్యదేవుని ప్రాకార సేవ



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్న వరం రత్నగిరి వాసుడైన శ్రీ వీరవేంకట సత్య నారాయణ స్వామివార్కి శనివారం ప్రాకార సేవ ఘనంగా జరిగింది. ఉద యం 10 గంటలకు శ్రీ స్వామి, అమ్మవార్లను ప్రాధాన రాజగోపురం వద్దకు తోడ్కొని వచ్చి సర్వాంగ సుందరంగా తిర్చి దిద్దిన వెండి తిరుచ్చిపై ఆశినులు గావించి భక్తుల గోవింద నామ స్మరణాలు, మేళ,తాళాలు నడుమ శ్రీ స్వామి,అమ్మవార్లను ముమ్మారు ప్రాధాన రాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు.ఈ కార్య క్రమంలో డిప్యూటీ ఈవో ఈరంకి.జగన్నాధరావు,ఏసి రమేష్ బాబు ఏఈవో బ్రమరాంబ, సూపరింటెండెంట్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# భయాందోళనలో యానాం స్థానికులు

యానాం : యానాం నియోజకవర్గంలో కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలు జాప్యం జరగడంతో స్థానికుల్లో భయాందోళన నెలకొంది.రోజు రోజుకి యానాంలో వైరస్ బారిన పడుతున్న బాధితులు పెరుగుతున్నారు.అయితే నిర్ధారణ పరీక్షలు నిమిత్తం అనుమానితుల శాంపిల్స్ ను తూర్పు గోదావరి జిల్లాలోని కాకినాడ కు పంపుతున్న నేపథ్యంలో పరీక్ష ఫలితాలు ఆలస్యం అవు తున్నాయి. అప్పటికే వైరస్ బారిన పడిన కొంత మంది బాధితులు ద్వారా మరికొంతమంది వైరస్ భారిన పడుతున్నారు.శుక్రవారం ఒక్క రోజే నియోజకవర్గంలో అత్యధికంగా 24 పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. కేవలం 70వేల జనాభా కలిగిన యానాం నియోజకవర్గంలో మొత్తం 106 మంది బాధితులు వైరస్ బారిన బారిన పడగా, ఇందులో ఇద్దరు మృతి చెందారు. అనుమానితుల కు ఎప్పటికప్పుడు నిర్ధారణ పరీక్షలు వేగంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని,వైరస్ నియంత్రణకు మరింత కట్టుదిట్టం మైన భద్రతా చర్యలను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా కరోనా కేసులు పెరుగు తుండడంతో యానాం లోని వ్యాపారులంతా స్వచ్ఛందంగా ఈనెల 28 నుండి వారం రోజుల పాటు తమ వ్యాపారాలను మూసివేసేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు అధికారులకు యానాం వర్తక సంఘం తమ నిర్ణయాన్ని తెలిపింది.


# విస్తృతంగా గ్రామాల్లో కంటి వైద్య శిబిరాలు



దేవరాపల్లి : మండలంలోని గరిసింగి పంచాయతీ శివారు చినగంగవరం గ్రామంలో శనివారం 50 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. సమాచార హక్కు ప్రచార ఐక్య వేదిక మండల అధ్యక్షుడు కెవి రమణ, వైఎస్ఆర్ సిపి నాయకుడు కోలా గోపి ఆధ్వర్యంలో విశాఖపట్నానికి చెందిన రాఘువేంద్ర కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు మురళి కంటి వైద్య పరీక్షలు జరిపారు. వైఎస్ఆర్ కంటి వెలుగు ద్వారా ఆపరేషన్ అవసరమైన వారిని విశాఖపట్నం తరలించారు.

ఉచితంగా ఆప రేషన్ చేయడంతో పాటు ఆపరేషన్ చేయించు కున్న ప్రతి ఒక్కరికి రూ. 3375/- వైఎస్ఆర్ ఆరోగ్య ఆసరా ద్వారా అందించబడుతుందని ఆస్పత్రి ప్రతినిధులు తెలిపారు.

# రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగింపు



తుప్పలను తొలగిస్తున్న దృశ్యం

కొయ్యూరు : కొయ్యూరు ఎన్ఆర్ఇజిఎస్ పనుల కింద మండలంలోని సింగిల్ రోడ్లకు ఇరువైపులా తుప్పలను ఎప్పై దాసరి నాగేంద్ర, ఏపిఒ కొండబాబు ఆధ్వర్యంలో తొలగిస్తున్నారు. గత వారంలో...

అల్లూరి యువ గిరిజన సేవా సంఘం ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా తుప్పలను తొలగించారు.

దీనికి స్పందించిన వీరు మండలంలో ఉన్న రోడ్లకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించారు. దీంతో అల్లూరి యువ గిరిజన సేవ సంఘం హర్షం వ్యక్తం చేశారు.


# పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

విజయనగరం : పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో బి.వి.అప్పారావు అన్నారు. 'మనం-మన పరిశుభ్రత' కార్యక్రమానికి ఎంపికైన వెంగాలరాయపురంలో ఆయన వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో కలిసి వీధుల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు వివరిం చారు. పరిశుభ్రత కార్యక్రమాలపై 15రోజుల పాటు వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఇదే అంశంపై శివరామపురం గ్రామంలో ఈవోపీఆర్డీ దేవకుమార్ ర్యాలీ చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు.

# గన్నెల పంచాయతీ పూజారి బందా రహదారి దుస్థితి ?

అరకులోయ : అరకు మండలంలోని గన్నెల పంచాయతీ పూజారి బంధ రహదారి దయనీయంగా మారింది తడక జంక్షన్ నుండి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పూజారి బంధ. కో జారి గూడా. ప్రజలు బయటకు రావాలంటేనే అవస్థలు తప్పడం లేదని వాపోయారు అత్యవసరానికి రోడ్డు ఎక్కాలంటే నరక యాతన పడుతున్నామని శనివారం విలేకరులకు తెలిపారు వర్షాకాలంలో పాదచారులకు వాహనచోదకులకు కనీసం మార్గం లేక పోయిందని వాపోతున్నారు ఆరోగ్య పరిస్థితి ఆసుపత్రికి వెళ్లాలన్న 108 వాహనాలు రావడానికి కూడా అవకాశం లేదని ఆయా గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రస్తుతం ఉన్న ప్రజా ప్రతినిధులు అరకు శాసనసభ సభ్యుడు స్పందించి రహదారి మరమ్మేతు నిమిత్తం సంబంధిత అధికారులను నివేదిక ఆదేశించి రహదారి పనులు మరమ్మేతుకు ప్రారంభించేలా చర్యలు పడ తారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## హోమ్ ఐసొలేషన్ లోఉండి చికిత్స అందుకొనుచున్న కరోన బాధితులు వైద్య సేవలకు ఎంతో సంతృప్తి వ్యక్తపరిచారు




కాకినాడ : హోమ్ ఐసొలేషన్ లోఉండి చికిత్స అందు కొనుచున్న కరోన బాధితులు జిల్లా కలక్టర్ డి.మురళీధర్ రెడ్డికి జిల్లా యంత్రాంగం అందిస్తున్న వైద్య సేవలకు ఎంతో సంతృప్తి వ్యక్తపరిచారని కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారి ఏజి చిన్నికృష్ణ తెలిపారు. ఆయన శనివారం జిల్లా కలక్టర్ ఆదేశాల ప్రకారం హోమ్ ఐసొలేషన్ లో ఉండి చికిత్స పొందుచున్న కరోన బాధితులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పితాపురం, కరప, సామర్లకోట, కాకినాడ రూరల్ గ్రామాల్లో ఉన్న హోమ్ ఐసొలేషన్ కోవిడ్ బాధీతులతో ఆర్.డి.ఓ. జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.డి.ఓ. వారితో మాట్లాడుతూ వారి ఆరోగ్య పరిస్థితుల గురించి, బాధితులకు అందించిన మెడికల్ కిట్ గురించి, మందుల వాడకం గురించి అడిగి తెల్సుకున్నట్లు ఆయన తెలియజేశారు. కరోన బాధితులు ఎంతో ఉల్లాసంగా ఉన్నారని ఆర్.డి.ఓ. వివరించారు.

# తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గరివిడి యువకుడు

గరివిడి : గరివిడి పట్టణానికి చెందిన యువకుడు ఎస్.లక్ష్మీనారాయణ రత్నగిరి (సతీష్) 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం దక్కించుకున్నారు. విశాఖపట్నంలో ఉద్యోగిగా స్థిరపడిన ఈయన విద్యావంతులైన యువత ఉద్యోగార్థులు కావాలన్న లక్ష్యంతో వినూత్న కార్యక్రమానికి 2011లో శ్రీకారం చుట్టారు. నిరుద్యోగ యువతీ యువకులకు అవసరమైన విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు విజ్ఞాన సమాచారాన్ని సామాజిక మాధ్యమాలు(ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్, టెలిగ్రాం) ద్వారా చేరువ చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 19 వేలకు పైగానే వివిధ ఉద్యోగ, ప్రైవేటు ప్రకటనలను షేర్ చేశారు. గరివిడిలో యువశ్రీ గ్రంథాలయాన్ని స్థాపించి 'పుస్తకాలు బహూకరించండి.. యువతకు చేయూత ఇవ్వండి' అనే నినాదంతో సుమారు రూ.2 లక్షల విలువ గల పలు విజ్ఞానదాయక పుస్తకాలను యువతకు అందుబాటులో ఉంచారు. ఇంతవరకు 40 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారని రత్నగిరి తెలిపారు.

# కార్పొరేషన్ల ఏర్పాటుపై హర్షం

ఇచ్ఛాపురం : : గతంలో ఏ ప్రభుత్వం చేయని మంచి కార్యక్రమాన్ని వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తోందని, అణగారిన రెడ్డిక సామాజికవర్గానికి చేయూతనిచ్చేందుకు సొసైటీని ఏర్పాటు చేయడం హర్షణీయమని ఇచ్ఛాపురం రెడ్డిక సామాజికవర్గ ప్రతినిధులు పేర్కొన్నారు. సంఘం ప్రతినిధులు సాడి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, ఆశి చిరంజీవులురెడ్డి ఆధ్వర్యంలో రాజావారి మైదానం వద్ద ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని పాలతో అభిషేకించారు. సంఘం నాయకులు పిలక యాదవరెడ్డి, చాట్ల తులసీదాసు, పిలక సంతు, దక్కత కృష్ణ మూర్తిరెడ్డి, పాతిర్ల ప్రతాప్‌రెడ్డి, ఉప్పాడ చినబాబురెడ్డి, మోహన రావు, లోకేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రలో అత్యధికంగా ఉన్న శిష్టకరణాలను నాడు వైఎస్ బీసీలలో చేర్చి న్యాయంచేశారు. ఆయన తనయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తమకు కార్పొరేషన్ ఏర్పాటుచేయడం హర్షణీయమని ఇచ్ఛాపురం శిష్టకరణ సంఘం నాయకులు నందిగాం కోటేశ్వరరావు, కల్లేపల్లి శ్రీను పేర్కొన్నారు. తమకు ఈ అవకాశం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సదాశివుని శ్రీను, కల్లేపల్లి ప్రసాద్, మణి, భాస్కర్, శంకరరావు, ప్రకాశరావు పట్నాయక్ పాల్గొన్నారు.

సోంపేట: ప్రత్యేక సొండికుల కార్పొరేషన్ ఏర్పాటుచేసి తమ సామాజిక వర్గానికి న్యాయంచేయాలని సొండి కుల సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు రత్నాల కాశీవిశ్వనాథ్ కోరారు. శు క్రవారం కొర్లాంలో రాష్ట్ర కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కదంబాల డిల్లేశ్వరరావు, ప్రముఖులు షావుకారు దివాకరరావు, పాండవ శేఖర్, నెమలిపురి గజపతి, చంద్రమోహన్, నరసింహమూర్తిలు మాట్లాడుతూ బి.సి.కార్పొరేషన్‌లో తమకు అవకాశమిచ్చినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వై.ఎస్.రాజశేఖరరెడ్డి తమను బీసీ-డీ లో గుర్తించగా ఇన్నాళ్లకు జగన్‌మోహన్‌రెడ్డి బీసీ కార్పొరేషన్‌లో అవకాశం కల్పించారని తెలిపారు.

కవిటిగ్రామీణం : అగ్నికుల క్షత్రియ సామాజికవర్గ అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని సంఘం నాయకులు అన్నారు. కపాసుకుద్దిలో సంఘం నాయకులు పీఏసీఎస్ ఛైర్మన్ శ్రీరాములు, చంద్రశేఖర్, వెంకటరావులు మాట్లాడుతూ కార్పొరేషన్ ఏర్పాటుతో మరింత అభివృద్ధి చెందగలమన్నారు. కళింగ కోమట్లకు బీసీ కార్పొరేషన్‌లో చోటు కల్పించడం హర్షదాయకమని వైజీపుట్టుగ కన్యకాపరమేశ్వరి కళింగ వైశ్యసంఘ నాయకులు అన్నారు.

# బాలల ప్రపంచం పోరాట యోధుడిని కోల్పోయింది

## - చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం(సీఆర్పీఎఫ్)రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గొండు సీతారాం



విశాఖపట్నం : దశాబ్దాల కాలాలపాటు బాలల హక్కులు,వారి సంక్షేమానికి ఉమ్మడి ఆంధ్ర,తెలంగాణల్లో ధైర్య సాహసాలతో పోరాటాలు సల్పి ఎన్నో విజయాలు సొంతం చేసుకున్న రాష్ట్ర బాలల హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి. అచ్యుతారావు ఇటీవల అకాల మరణం చెందడం బాధాకరమని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం(సీఆర్పీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గొండు సీతారాం అన్నారు. శనివారం నక్కవానిపాలేం లోని శ్రీ వివేకానంద కళ్యాణ మండపం లో అచ్యుతరావు సంస్మరణ సభను సీఆర్పీఎఫ్ విశాఖ రూరల్,జిల్లా,గాజువాక కమిటీల ఆధ్వర్యంలో నిర్వ హించారు. ఈ కార్యక్రమం ఫోరం అర్బన్ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్,రూరల్ జిల్లా అధ్యక్షుడు బాకా లవకుశ ఆధ్వర్యంలో లో నిర్వహించారు,ముందుగా ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గొండు సీతారాం, హాజరైన సభ్యులు అచ్యుతరావు చిత్రపటానికి పూల మాలలు వేసి అంజలి ఘటించారు

అనంతరం జరిగిన కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సీతారాం మాట్లాడుతూ దాదాపు నలభై ఏళ్ల బాలల హక్కుల కోసం నిరంతరం నమ్మకం,నిబద్ధత,అకుంఠిత దీక్షతో పోరాటాలు నెరిపి అవి విజయవంతం అయ్యేవరకు నిద్ర పోని అసలు,సిసలైన బాలల పోరాట యోధుడు అచ్యుత రావు అన్నారు,

ఆయన ప్రతిభాపాటవాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం గతంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ (ఎస్.సి. పి.సి.ఆర్) లో కీలకమైన మెంబర్ పదవి ని కట్ట బెట్టినప్పటికి అచ్యుతరావు ఆలోచనలకు, ఆశయాలుకు, జరుగుతున్న అకృత్యాలను చూసి చలించి తృణప్రాయంగా ఆ పదవిని త్వరిత గతిన విడిచిపెట్టి మళ్లీ బాలల హక్కుల పోరాట పోరు బాట బట్టిన ఏకైక బాలల పోరాట యోధుడు అచ్యుత రావు అని అన్నారు. ఆయన సేవలను ప్రస్తుత బాలల సంఘాలు ఆదర్శవంతంగా తీసుకొని ఆయన ఆశయ సిద్ధికి అడుగులు వేయాలని కోరారు

ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శకుంతల,సైకాలజీ విభాగం అధ్యక్షుడు డాక్టర్ కె.జగ్గారావు లు మాట్లాడుతూ దివంగత అచ్యుత రావు ను తన తోటి బాలల సంఘాలు,ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు ఎన్నో విధాలా అభాసుపాలు జేస్తు,ఆయనను అణగదొక్కాలని ఎన్ని కుతంత్రాలు పన్నినా వారికి ధీటుగా ఎదిగారని అన్నారు, తన కర్తవ్య నిర్వహణలో వెరవక, నెరవక తన ప్రత్యర్థుల,ప్రభుత్వాల గుండెల్లో నిద్రపోతూ,లక్ష్యం నెరవేర్చేందుకు మొత్తం తన జీవితాన్ని బాలలకు అర్పించిన మహోన్నత భావాలు గల ధీశాలి అచ్యుత రావు అని కొనియాడారు.

### అచ్యుతరావు పేరు మీదుగా పేదలకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేసిన సీఆర్పీఎఫ్:-

అచ్యుత రావు సేవలను స్మరిస్తూ, సీతమ్మధార, నక్కవాని పాలెం పరిసర ప్రాంతాల్లో వంద మంది రోడ్లపై సంచరించే నిరు పేద అన్నార్తులకు, మానసిక దివ్యాంగులకు, అన్న ప్రసాద ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఫోరం జిల్లా కో.కన్వీనర్ జి.సత్యవతి, కార్యదర్శులు పి.శేఖర్,కరుణాకర్, సభ్యుడు బి.ఎల్.రెడ్డి, ముకుంద రావు, నభి తదితరులు పాల్గొన్నారు.

# మనోధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో కరోనాను జయించవచ్చును

## - విజయనగరం జిల్లా ఎస్పీ బి.రాజకుమారి, ఐ.పి.ఎస్



విజయనగరం : విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం మిమ్స్ ఆసుపత్రిలో కరోనాకు చికిత్స పొంది, సంపూర్ణ ఆరోగ్యంతో జూలై 24న డిశ్చార్జ్ అయిన విజయనగరం పట్టణం కొత్త అగ్రహారంకు చెందిన మంగళగిరి గోదాదేవిని (86సం.లు)నుజిల్లా ఎస్పీ శ్రీమతి బి. రాజకుమారి తే. 25-07-2020 ది, శనివారం నాడు వారింటికి వెళ్ళి, పరామర్శించారు. విజయనగరం జిల్లా ఎస్పీ తి బి. రాజకుమారి జూలై 25న కొత్త అగ్రహారంలో నివసిస్తున్న మంగళగిరి గోదాదేవి ఇంటికి వెళ్ళి, కోవిడ్‌ను జయించిన వృద్ధురాలును పరామర్శించి, ఆమె ఆరోగ్యం గురించి వాకబు చేసి, త్వరగా కోవిడ్ నుండి కోలుకొన్నందుకుగాను ఆమెకు పుష్ప గుచ్ఛంను పండ్లును అందించి, శుభాకంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీమతి బి. రాజకుమారి మాట్లాడుతూ - మనలో మనోధైర్యం, ఆత్మ విశ్వాసం ఉంటే కరోనాను జయించవచ్చును అన్నదానికి గోదాదేవి గారే నిదర్శనమన్నారు. 86 సం.ల వయస్సులో కూడా ఆమె ఎంతో మనో నిబ్బరంతో ఒంటరిగా కరోనాను ఎదుర్కొని, జయించారన్నారు. కావున, ప్రజలెవ్వరూ కరోనా అంటే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కరోనా పట్ల అప్రమత్తంగా ఉంటే చాలన్నారు. ముందస్తు జాగ్రత్తలు పాటించడం వలన కరోనా రాకుండా అడ్డుకోవచ్చునన్నారు. ముందస్తు జాగ్రత్తలు పాటించినప్పటికీ కరోనా సోకితే ఆందోళన చెందవద్దని, ఆవిరి పట్టడం, పసుపు, ఉప్పును నీళ్ళులో కలిపి, నోటిలో పుక్కిళ్ళించడం, బలవర్ధకరమైన ఆహారాన్ని, సి విటమిన్ అధికంగా లభించే పండ్లు తీసుకోవాలన్నారు. చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, మాస్క్ తప్పనిసరిగా ధరించడం, వ్యక్తులమధ్య దూరాన్ని పాటించడం చేయాలన్నారు. రాష్ట్ర డిజిపి శ్రీ గౌతం సవాంగ్, ఐపిఎస్ మరియు విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎల్.కే.వి. రంగారావు, ఐపిఎస్‌లు కూడా 86 సం.ల వయస్సులో కరోనాను జయించినందుకుగాను శుభాకాంక్షలు తెలిపినట్లుగా జిల్లా ఎస్పీ గోదాదేవికి తెలిపగా, అందుకు, గోదాదేవి చాలా సంతోషం, ఆనందాన్ని వ్యక్తం చేసారు. పోలీసు ఉన్నతాధికారి అయిన జిల్లా ఎస్పీబి.రాజకుమారి తనను వెతుకుతూ తన ఇంటికి రావడం, పరామర్శించడం తనకు చాలా ఆనందంగా ఉందని తెలిపారు. జిల్లా ఎస్పీ బి.రాజకుమారి గోదాదేవి కుటుంబ సభ్యులతో మాట్లాడి, ఆమెను చక్కగా చూసుకోవాలని, మందులను సమయానికి అందించాలని, ఎటువంటి నిర్లక్ష్యం చేయకుండా బలమైన ఆహారాన్ని అందించాల్సిందిగా సూచించారు. అదే విధంగా మహిళా కానిస్టేబులు రాధిక సేవలను జిల్లా ఎస్పీ కొనియాడారు. అంతేకాకుండా, ఏదైనా సహాయం కావల్సి వస్తే తమను సంప్రదించ వచ్చునన్న భరోసాను వారి కుమారుడు మనోహర్‌కు జిల్లా ఎస్పీ శ్రీమతి బి. రాజకుమారి అందించారు. మహిళా కానిస్టేబులు రాధిక తనను తల్లిలా లాలించింది మంగళగిరి గోదాదేవి మాట్లాడుతూ - కరోనా సోకడం వలన తాను ఒంటరిగా కోవిడ్ ఆసుపత్రిలో ఉండడం వలన భయానికి లోనయ్యానన్నారు. ఆ సమయంలో నాలో ధైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని మహిళా కానిస్టేబులు రాధిక నింపారని, తాను డిశ్చార్జ్ అయ్యేంత వరకు తనకు అన్ని విధాలుగా సహాయంగా ఉంటానని, ఎటువంటి భయం, ఆందోళనకు గురికావద్దని పదే పదే చెప్పేదన్నారు. రాధిక సేవలను నేను ఎన్నటికీ మరువలేను. వృద్ధాప్యంలో తనకు కోవిడ్ సోకడం వలన, నా కుటుంబ సభ్యులు కూడా దగ్గరకి రాలేని పరిస్థితి ఏర్పడిందని, తనకు దేవుడిచ్చిన వరంలా మహిళా కానిస్టేబులు రాధిక తనను కన్నతల్లి వలే ఆదరించిందన్నారు. వృద్ధాప్యం వలన తన చేతులు వణుకుతుండడం వలన అన్నం కలుపుకొని తినే పరిస్థితి ఉండేది కాదన్నారు. మహిళా కానిస్టేబులు రాధిక తనకు అన్నంను మెత్తగా చేసి, కలిపి ఇచ్చేదని, తాను స్పూనుతో తినేదానినన్నారు. నేను డిశ్చార్జ్ అయ్యేంత వరకు రాధిక పోలీసుగా పని చేస్తున్నట్లుగా తనకు తెలియదన్నారు. తనను పోలీసులే దేవుడిలా సేవ చేసి, రక్షించారన్నారు.జిల్లా ఎస్పీ వెంట విజయనగరండిఎస్పీ పి. వీరాంజనేయ రెడ్డి, ఎఆర్ డిఎస్పీ ఎల్. శేషాద్రి, ఎస్బీ సిఐ జి.రాంబాబు, విజయనగరం రూరల్ సిఐ టి.ఎస్. మంగవేణి, 1వ పట్టణ ఎస్ఐ ప్రసాదరావు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# కొవిడ్ విధులకు వైద్యుల నియామకం

శ్రీకాకుళం : జిల్లా కొవిడ్ ఆసుపత్రి జెమ్స్‌లో విధులు నిర్వర్తించేందుకు వైద్యుల నియామకానికి జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.చెంచయ్య తెలిపారు. ఎంబీబీఎస్, ఆయూష్ వైద్య విద్య అభ్యసించి, ఏపీ మెడికల్ కౌన్సిల్‌లో నమోదైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. '104' సేవల్లో పనిచేస్తున్న వైద్యాధికారులు కూడా హాజరుకావచ్చని చెప్పారు. ఎంపికైనవారికి ప్రభుత్వ నిబంధనల మేరకు జీతభత్యాలు చెల్లిస్తామని పేర్కొన్నారు.

**పరిపాలనాధికారిపై ఫిర్యాదు**

శ్రీకాకుళం : వీరఘట్టం పీహెచ్‌సీ వైద్యాధికారితోపాటు, సంత నర్సింగపురం ఆరోగ్య ఉప కేంద్రంలో పని చేస్తున్న సిబ్బందిపై వైద్య ఆరోగ్య శాఖ పరిపాలనాధికారి వేధింపులకు పాల్పడు తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని అక్కడి సిబ్బంది డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.చెంచయ్యకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని డీఎంహెచ్‌వో వద్ద ప్రస్తావించగా... వైద్యాధికారి తనకు ఫిర్యాదు ఇవ్వలేదని కలెక్టర్‌కు ఇచ్చారని, పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులర్ కోసం

# మంత్రివర్గ ఉప సంఘం సమావేశమవ్వాలి...!

## మంత్రులకు లేఖలు పంపిన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేత ఆస్కారరావు



కాకినాడ: కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులర్ కోసం ప్రభుత్వం ప్రత్యేకించి నియమించిన మంత్రివర్గ ఉపసంఘం తక్షణమే సమావేశమై అర్హులైన కాంట్రాక్టు ఉద్యోగుల ఏళ్లనాటి రెగ్యులర్ కల తీర్చే విధంగా నిర్ణయం తీసుకుని తగు న్యాయం చేయాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆస్కారరావు విజ్ఞప్తి చేసారు.ఈ మేరకు ఆస్కారరావు మంత్రివర్గ ఉపసంఘంలోని ఆరుగురు మంత్రులకు శనివారం లేఖలు రాసారు. రెగ్యులర్ కు అర్హులైన వారిలో పలు ప్రభుత్వ శాఖలలోని కాంట్రాక్టు ఉద్యోగుల్లో పరిమిత సంఖ్యలోనే అర్హులైన వారున్నారని, వారందరినీ రెగ్యులర్ చేయడం వల్ల ప్రభుత్వంపై ఎటువంటి అదనపు ఆర్థిక భారం పడే అవకాశం ఉండదని ఆయన స్పష్టం చేశారు.ముఖ్యంగా, రెగ్యులర్ అయ్యే అవకాశాలు ఉన్న కాంట్రాక్టు ఉద్యోగుల్లో ఎక్కువ మంది వైద్య ఆరోగ్య శాఖ కు చెందిన వారు ఉన్నారని ఆ శాఖకే చెందిన ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘానిక రాష్ట్ర అధ్యక్షులు కూడా అయిన ఆస్కారరావు చెప్పారు. అటువంటి వైద్య ఆరోగ్య శాఖ లోని ఎందరో కాంట్రాక్టు ఉద్యోగులే నేడు కఠోర కరోనా కట్టడికోసం ప్రాణాలకు తెగించిమరీ విధులు నిర్వహిస్తు అనారోగ్యాల పాలై ప్రాణాలనే పణంగా పెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. తాము బలైపోతూనే అందరి ఆరోగ్యాలను కాపాడేందుకు కోవిడ్ సేవలందిస్తున్న కీలక సమయంలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడం ద్వారా ఉద్యోగులకు తగిన గుర్తింపు, తద్వారా ప్రభుత్వానికి కూడా తగిన గౌరవం దక్కే అవకాశం ఉంటుందని ఆయన సూచించారు. ఇదే విషయాన్ని తాను రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి లేఖ రాస్తూ తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచానని ఆస్కార్ రావు అన్నారు. ప్రస్తుతం రోజు రోజుకీ కరోనా విజృంభిస్తున్న వేళ వైద్య ఆరోగ్య శాఖ లోని కాంట్రాక్టు ఉద్యోగులంతా కోవిడ్ విధుల్లో పగలనక రేయనక కనీసం సెలవులు కూడా లేకుండా నిర్విరామంగా వారి ప్రాణాలకు తెగించి మరీ వైద్య సేవలు అందిస్తున్నారు. ఫ్రంట్ లైన్ వర్కర్లుగా కోవిడ్ పరీక్షలు చేయుచూ ఔషధాల సరఫరా లోనూ కోవిడ్ వ్యాధిగ్రస్తుల సేవల్లో క్వారంటయిన్ ల్లో తమ కుటుంబాలను సైతం విడిచిపెట్టి పనిచేస్తున్నారని ఆస్కారరావు రాసిన లేఖలో వివరించారు. ప్రాధమిక ఆరోగ్య సర్వేలేన్స్ టీం లో వీరు సేకరించిన సమాచారం ఆధారంగానే కోవిడ్ వ్యాధిగ్రస్తులను నిర్ధారించవలసి ఉంది. ప్రాణాలను సైతం పణంగా పెట్టి చేస్తున్నా ఈ విధుల్లో పనిచేస్తున్న వారిలో కొందరికి వ్యాధి సోకి అనారోగ్యంతో చనిపోవడం కూడా జరిగిందని ఆవేదనగా ఆయన పేర్కొన్నారు. అలా చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలు దిక్కు మొక్కు లేక అర్ధంతరంగా అనాధలుగా రోడ్డున పడుతున్నారని, దీనికంతటికీ ఎలాంటి భద్రతా భరోసా లేని కాంట్రాక్టు ఉద్యోగులు కావడమే ప్రధాన కారణమని ఆస్కారరావు అన్నారు.ముఖ్యంగా, జూన్ నెలాఖరు నాటికే ఈ రెగ్యులర్ ప్రక్రియ తేలాల్సిఉందని, జరుగుతున్న జాప్యాన్ని నివారించి తక్షణమే మంత్రివర్గ ఉపసంఘం సమావేశం నిర్వహించాల్సిందిగా ఉప సంఘం లోని మంత్రులైన బుగ్గన రాజేంద్రనాధ్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆళ్ల నాని, బొత్స సత్యనారాయణ, బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆదిమూలపు సురేష్‌లకు ఆస్కారరావు రాసిన లేఖలో కోరారు. రెగ్యులర్ కాకుండానే చనిపోతున్న కాంట్రాక్టు ఉద్యోగుల మరణాలను చూసైనా మానవతా దృక్పథంతో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులైన మంత్రులు స్పందించాలని ఆయన అభ్యర్థించారు.



# డా.కోనేరు రంగారావు జయంతి (జూలై 26)

కోనేరు రంగారావు, కాంగ్రేసు పార్టీకి చెందిన రాజకీయనాయకుడు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పురపాలన, పట్టణాభివృద్ధిశాఖ మాజీ మంత్రి. మాజీ ఉప ముఖ్యమంత్రి.

కోనేరు రంగారావు, 1935, జూలై 26న కృష్ణాజిల్లా గూడవల్లి గ్రామములో ఒక దళిత కుటుంబంలో జన్మించారు. ఈయన తండ్రి తాతయ్య. గూడవల్లి గ్రామానికి పంచాయితీ సర్పంచిగా రాజకీయ జీవితము ప్రారంభించిన రంగారావు సర్పంచిగా 10 సంవత్సరాలు పనిచేశారు. ఆ తరువాత కంకిపాడు నియోజకవర్గము నుండి శాసనసభకు ఎన్నికై, సామాజికాభివృద్ధి శాఖా మంత్రి అయ్యారు. ఈయన పురపాలక శాఖ, దేవాదాయ శాఖ, సామాజికాభివృద్ధి శాఖలలో మంత్రిగా పనిచేశారు. కోట్ల విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రి గా ఉన్న సమయం లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా కూడా పనిచేశారు. రంగారావు కృష్ణ జిల్లా తిరువూరు శాసన సభా నియోజకవర్గము నుండి శాసనసభకు రెండు పర్యాయములు ఎన్నికైనారు. 1989 శాసన సభ ఎన్నికల్లో రంగారావు కాంగ్రెస్ నుండి రవీంద్రనాథ్ టీడీపీ అభ్యర్థి గా పోటీపడగా రంగారావు విజయం సాధించారు. 1994,99 ఎన్నికల్లో రంగారావు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి టీడీపీ అభ్యర్థి ఎన్. స్వామి దాసు చేతిలో రెండు పర్యాయాలు ఓటమి చెందారు. 2004 లో అదే స్వామి దాసు పై విజయం సాధించారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఏర్పడ్డ ప్రభుత్వంలో వీరు పురపాలన, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి గా పదవిని నిర్వహించారు. 2010 మార్చి 15 న వీరు మరణించారు. ఆయన సతీమణి కోనేరు అలీసమ్మ. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉండగా కోనేరు రంగారావు నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పరిచారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో భూపంపిణీ కార్యక్రమాల అమలును పరిశీలించి, ఈ కార్యక్రమాలను మరింత సమర్ధవంతంగా అమలు చేసేందుకు అవసరమైన సూచనలు చేసేందుకు ఏర్పాటు చేసిన కమిటీయే కోనేరు రంగారావు కమిటీ. ఈ కమిటీని నాటి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలోని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 2004 డిసెంబర్ 1 నాటి జీవో %వీం.చీశ%.977, 2004 డిసెంబర్ 23 నాటి జీవో %వీం.చీశ%.1091 ల ద్వారా ఏర్పరచింది. ఈ కమిటీ తన నివేదికను 2006 లో ప్రభుత్వానికి సమర్పించింది. దీనిని ప్రభుత్వం 2007 మే 27 న బహిరంగ పరిచింది.

# విపత్తుల నుంచి లాభాలు పొందుతున్నారు.. : రాహుల్



దిల్లీ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఇది పేదల వ్యతిరేక ప్రభుత్వమని.. కరోనా మహమ్మారి సమయంలో కూడా లాభాల కోసం చూస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

లాక్‌డౌన్ సమయంలో వలస కార్మికులను వారి వారి స్వస్థలాలకు చేర్చేందుకు తీసుకువచ్చిన శ్రామిక్ ప్రత్యేక రైళ్ల ద్వారా జులై 9నాటికి రూ.429 కోట్ల ఆదాయం సమకూరినట్లు రైల్వే శాఖ వెల్లడించింది. ఈ ప్రకటనపై రాహుల్ తీవ్ర విమర్శలు చేశారు. 'ఓ వైపు మహమ్మారి విరుచుకుపడుతోంది.. మరోవైపు ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. ఈ పేదల వ్యతిరేక ప్రభుత్వం విపత్తుల సమయంలోనూ లాభాల్ని ఆశిస్తోంది.' అంటూ రాహుల్ ట్విటర్‌లో విరుచుకుపడ్డారు. రైల్వే ఆదాయానికి సంబంధించిన నివేదికనూ దీనికి జత చేశారు.

దేశంలో శ్రామిక్ రైళ్లను వలస కార్మికుల కోసం మే 1 నుంచి కేంద్ర ప్రభుత్వం నడుపుతోంది. జులై 9 వరకూ 4,496 ప్రత్యేక రైళ్లను నడిపారు. దాదాపు 6.3 మిలియన్ ప్రజలను వారి స్వస్థలాలకు చేర్చారు.

# లాక్‌డౌన్ పూర్తిగా ఎత్తేస్తామని చెప్పలేదే!

## మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే



ముంబయి: ఆర్థిక వ్యవస్థ నష్టపోతోందని రాష్ట్రంలో పూర్తిగా లాక్‌డౌన్ ఎత్తేసేందుకు తాను సుముఖంగా లేనని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. మహమ్మారి కారణంగా సవాళ్లు ఎదురవుతున్నా ఆర్థిక, ఆరోగ్య వ్యవస్థల మధ్య సమతూకం సాధించడం అవసరమని పేర్కొన్నారు. శివసేన పార్టీ అధికార పత్రికతో ఆయన మాట్లాడారు. 'పూర్తిగా లాక్‌డౌన్ ఎత్తేస్తానని నేనెప్పుడూ అనలేదు. కొద్దికొద్దిగా తెరుద్దామని చెప్పాను. ఒకసారి తెరిచాక మళ్లీ మూసేయొద్దన్నది నా ఉద్దేశం. దశలవారీగా వ్యాపారాలను తెరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాను. ఆర్థిక వ్యవస్థా, ఆరోగ్యమా అని ఆలోచించకూడదు. రెండింటి మధ్య సమతూకం అవసరం. ఈ మహమ్మారి ప్రపంచ యుద్ధంలాంటిది. అన్ని దేశాలూ దీని బారిన పడ్డాయి. వైరస్ ప్రభావం పోయిందని ఆర్థిక వ్యవస్థలు తెరిచిన దేశాలు ఇప్పుడు మళ్లీ ఆంక్షలు విధిస్తున్నాయి. ఆస్ట్రేలియాలో సైన్యాన్ని రంగంలోకి దించారు' అని ఉద్ధవ్ అన్నారు. 'చాలామంది లాక్‌డౌన్‌ను వ్యతిరేకిస్తున్నారు. ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడుతుందని అంటున్నారు. వారిని నేనొక్కటే ప్రశ్న అడుగుతున్నాను. లాక్‌డౌన్ ఎత్తేశాక ప్రజలు చనిపోతే వారు బాధ్యత వహిస్తారా? ఆర్థిక వ్యవస్థపైన మాకూ బాధేస్తోంది' అని అన్నారు. ముంబయిలో సబర్బన్ రైల్వే నెట్‌వర్క్ పునః ప్రారంభం గురించి ప్రశ్నించగా 'వారి కుటుంబాలు అస్వస్థతకు గురై ఇళ్లన్నీ తాళం వేయాల్సి వస్తే పరిస్థితి ఏంటి? అందుకే ప్రతిదీ దశలవారీగా చేయాలంటున్నాం' అని పేర్కొన్నారు.

మహావికాస్ అఘాడి ప్రభుత్వ సవాళ్లు, ప్రతిపక్షాల గురించి ఆయన మాట్లాడారు.

# 26 ఏళ్ల తర్వాత విండీస్ బౌలర్ ఘనత

## 200వ వికెట్ తీసిన కీమర్ రోచ్



మాంచెస్టర్: ఇంగ్లాండ్‌తో జరుగుతున్న మూడో టెస్టులో విండీస్ బౌలర్ కీమర్ రోచ్ 200వ టెస్టు వికెట్ సాధించాడు. శనివారం క్రిస్‌వోక్స్(1)ను క్లీన్‌బౌల్డ్ చేసిన అతడు విండీస్ తరఫున ఈ ఘనత సాధించిన తొమ్మిదో బౌలర్‌గా రికార్డులకెక్కాడు. 1994లో కర్ట్‌లీ ఆంబ్రోస్ తర్వాత 26 ఏళ్లకు రోచ్ ఈ ఘనత దక్కించుకోవడం విశేషం. ఈ సందర్భంగా నాటి బౌలర్ ఆంబ్రోస్.. రోచ్‌కు ప్రత్యేకంగా ఓ వీడియో సందేశం పంపాడు. ఐసీసీ ట్విటర్‌లో పంచుకున్న ఆ వీడియోలో రోచ్ ఇలాగే కొనసాగుతూ మున్ముందు 250, 300 వికెట్లు తీయాలని ఆకాంక్షించాడు. రోచ్ 59 టెస్టుల్లోనే 200 వికెట్లు పడగొట్టాడు. అందులో తొమ్మిదిసార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేయడం గమనార్హం.

ఇదిలా ఉండగా, శుక్రవారం తొలి రోజు బౌలింగ్ చేసిన రోచ్.. డొమినిక్ సిబ్లీ(0), బెన్‌స్టోక్స్(20)ను కూడా పెవిలియన్ చేర్చాడు. శనివారం వెలుతురు సరిగ్గా లేనందున ఆటను నిర్ణీత సమయం కన్నా ముందే నిలిపివేశారు. అప్పటికి ఇంగ్లాండ్ స్కోర్ 258/4గా నమోదైంది. ఒల్లీపోప్(91), జాస్‌బట్లర్ (56) క్రీజులో ఉన్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం ఆటను ప్రారంభించిన కొద్దిసేపటికే ఆతిథ్య జట్టు మూడు వికెట్లు కోల్పోయింది.

వచ్చీ రాగానే ఒల్లీ పోప్ అదే స్కోరు వద్ద గాబ్రియెల్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. బట్లర్ మరో 11 పరుగులు చేసి (67) పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఔటయ్యాడు. చివర్లో స్టువర్ట్ బ్రాడ్ (62బీ 45 బంతుల్లో 9%ఇ4, 1ఇ%6) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడడంతో ఇంగ్లాండ్ 369 పరుగులు చేసి ఆలౌట్ అయింది. కాగా, ఇరు జట్లూ ఇప్పటికే చెరో మ్యాచ్ గెలిచిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో ఎవరు గెలిస్తే వాళ్లదే సిరీస్ సొంతమవుతుంది.

# ఉగ్రదాడులపై ఆ రెండు రాష్ట్రాలను హెచ్చరించిన యూఎన్



న్యూఢిల్లీ: కేరళ, కర్ణాటకల్లో ఐసిస్ ఉగ్రవాదులు గణనీయమైన సంఖ్యలో ఉన్నట్లు ఐరాస నివేదిక హెచ్చరించింది. భారత ఉపఖండ టెర్రర్ గ్రూపులోని అల్-ఖైదా.. భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, మయన్మార్‌లకు చెందిన దాదాపు 150 నుంచి 200 మంది ఉగ్రవాదులను కలిగి ఉందని పేర్కొంది. వీరిలో ఎక్కువ మంది కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో తలదాచుకుంటున్నట్లు తెలిపింది. అల్‌ఖైదా ఇండియన్ సబ్ కాంటినెంట్ ప్రస్తుత నాయకుడు ఒసామా మహమూద్ తమ మాజీ నాయకుడు అసీమ్ ఉమర్ మరణానికి ప్రతీకారం తీర్చుకోవడానికి ఈ ప్రాంతాల్లో ప్రతీకార చర్యలకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు యూఎన్ నివేదికలో హెచ్చరించింది.

## దేశాన్ని దోచుకున్నవారే మాట్లాడుతున్నారు



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం శ్రామిక్ రైళ్ల ద్వారా లాభాలను అర్జిస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర రైల్వే మంత్రి పీయూష్ గోయల్ ట్విటర్ వేదికగా శనివారం గట్టిగా కౌంటరిచ్చారు. ఎవరైతే దేశాన్ని దోచుకున్నారో వారికి సబ్సిడీలు లాభాలుగా కనిపిస్తున్నాయని గోయల్ విమర్శించారు. అయితే శనివారం రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై ట్విటర్ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. దేశంపై కరోనా మహమ్మారి అనే మబ్బు దట్టంగా కమ్ముకుంది. ప్రజలు అష్టకష్టాలూ పడుతన్నా ప్రభుత్వం రైల్వే శాఖ ద్వారా 429.90 కోట్ల లాభాలను ఆర్జించిందని ట్వటర్‌లో వేదికగా రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. అయితే రెండు నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం కరోనాను నియంత్రించేందుకు లాక్‌డౌన్‌ను ప్రకటించగా, వలస కార్మికులు తమ గమ్య స్థానాలకు చేరడానికి శ్రామిక ప్యాసింజర్ రైళ్లల్లో ఉచితంగా కాంగ్రెస్ పార్టీ టికెట్లు ఇస్తుందని ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ప్రకటించిన విషయాన్ని గోయల్ గుర్తు చేశారు. కాగా సోనియా చేసిన ఉచిత రైల్వే టికెట్లను ఎప్పుడు ఇస్తారోనని ప్రజలు అడుగుతున్నారని గోయల్ తెలిపారు.

## లూపిన్ ఫౌండేషన్ థర్మల్ గన్స్, పల్స్ ఆక్సీమీటర్లు వితరణ



విశాఖపట్నం : కోవిడ్-19 ఎదుర్కొనేందుకు లూపిన్ ఫౌండేషన్ థర్మల్ గన్స్, పల్స్ ఆక్సీ మీటర్లు జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ కు అందజేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్ లో శనివారం అందజేశారు.

ఇందులో థర్మల్ గన్స్-02, పల్స్ ఆక్సీ మీటర్లు-20 లను జిల్లా కలెక్టర్ కు అందజేశారు. ఫౌండేషన్ మేనేజర్ బి. వెంకటేశ్వరరావు, సీనియర్‌ల ఎగ్జిక్యూటివ్ ఎస్. అర్జున్ పాల్గొన్నారు.

## అంతకన్నా గొప్ప మానవత్వం ఏముంటుంది?



హైదరాబాద్: కరోనా మహమ్మారిని జయించిన వారు ప్లాస్మా దానానికి ముందుకు రావాలని ప్రముఖ సినీ నటుడు చిరంజీవి విజ్ఞప్తి చేశారు. ప్లాస్మాను దానం చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. శనివారం ఆయన ఈమేరకు ట్వీట్ చేశారు. యావత్ ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనాతో నెలకొన్న క్లిష్ట పరిస్థితుల్లో ఇంతకంటే గొప్ప మానవత్వం ఇంకేముంటుందని పేర్కొన్నారు. కరోనా వారియర్లు ఇప్పుడు ప్రాణ రక్షకులు కావాలని చిరు ఆకాంక్షించారు. కరోనా మహమ్మారి లక్షణాల నుంచి కోలుకొన్న ప్రతిఒక్కరూ ప్లాస్మా దానానికి ముందుకురావాలంటూ సైబరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఇచ్చిన పిలుపుపై చిరంజీవి ఈవిధంగా స్పందించారు. ఈ మేరకు సజ్జనార్ మాటలతో కూడిన ఓ వీడియోను తన ట్వీట్‌కు జత చేశారు.

## త్వరలోనే భారత్‌కు అత్యాధునిక బోయింగ్ విమానాలు

న్యూఢిల్లీ : చైనాతో ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ తన రక్షణ వ్యవస్థను బలోపేతం చేసుకుంటున్నది. ఇందులో భాగంగానే అమెరికా నుంచి 1.8 బిలియన్ డాలర్ల విలువైన మరో ఆరు బోయింగ్ పోసిడాన్ -8 ఐ విమానాలను కొనుగోలు చేసేందుకు నిర్ణయించింది. ఇందుకోసం 'లెటర్ ఆఫ్ రిక్వెస్ట్' జారీ చేసింది. కొత్త పీ -8 ఐ విమానం సీఓఎంసీఏఎస్ఏ(కమ్యూనికేషన్స్ కంపాటిబిలిటీ అండ్ సెక్యూరిటీ అగ్రిమెంట్) రక్షిత పరికరాలను కలిగి ఉంటుంది. చైనాతో డోక్లాం స్టాండ్ ఆఫ్ సమయంలో, పుల్వామా టెర్రర్ దాడి తర్వాత పాకిస్తాన్ పై నిఘా ఉంచేందుకు భారతదేశం ఈ విమానాలనే ఉపయోగించింది.

హిందూ మహాసముద్రంతోపాటు తూర్పు లడఖ్‌పై నిఘా మిషన్లు నిర్వహించేందుకు ఇండియా ఇప్పటికే పీ -8 ఐ నావికాదళ పెట్రోలింగ్ విమానాలను ఉపయోగిస్తోంది. యూఎస్ కాంగ్రెస్ నుంచి ఆమోదం పొందిన తర్వాత అమెరికా త్వరలో అంగీకార పత్రాన్ని పంపుతుంది. ఆ తర్వాత వచ్చే ఏడాది ఒప్పందం కుదుర్చుకోవచ్చు. ఆరు కొత్త పీ -8 ఐ విమానాలు వాణిజ్యపరంగా లభించే వాటితో పోలిస్తే చాలా ఆధునికమైనవి, సురక్షితమైనవి.



ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రం అంతా పచ్చగా ఉండాలని మొక్కలను నాటడమే గాక ఆ మొక్కల సంరక్షణ బాధ్యత తీసుకొన్న రోజునే నిజమైన వనమహోత్సవం అని భావించారని అందుకే రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం భారీ ఎత్తున చేపట్టామని చిత్తూరు ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు అన్నారు. కట్టమంచి కి చెందిన మహిళా నాయకురాలు హరిణి రెడ్డి ఆధ్వర్యం లో కట్టమంచి చెరువు వద్ద చెట్లు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయనతో పాటు ఛైర్మన్ పురుషోత్తం రెడ్డి, గోవర్ధన్ బాబి, కిషోర్ కుమార్ రెడ్డి, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కట్టమంచి చెరువు చుట్టూ సుమారు 3 కిలోమీటర్ల దూరం నతనున్నట్లు హరిణి రెడ్డి తెలిపారు.

## 4.2 లక్షల శాంపిళ్లకు పరీక్షలు.. ఇదే అత్యధికం



దిల్లీ : దేశంలో కరోనా విజృంభణ కొనసాగుతూనే ఉంది. గడిచిన కొన్ని రోజులుగా నిత్యం 45 వేలకుపైగా కేసులు నమోదవు తున్నాయి. మరోవైపు దేశవ్యాప్తంగా పరీక్షల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోంది. గడిచిన 24 గంటల్లో రికార్డు స్థాయిలో 4,20,898 శాంపిళ్లను పరీక్షించినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. దేశంలో వైరస్ బయటపడ్డప్పటి నుంచి ఒక్క రోజులో ఇంత భారీ స్థాయిలో పరీక్షలు నిర్వహించడం ఇదే తొలిసారి. పరీక్షల సంఖ్య భారీగా పెరగడంతో.. టెస్టు పర్ మిలియన్(టీపీఎం) సంఖ్య కూడా 11,485కి చేరినట్లు అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా మొత్తం పరీక్షల సంఖ్య 1,58,49,068కి చేరిందని చెప్పారు.

గత 24 గంటల్లో 48,916 కొత్త కేసులు నమోదు కావడంతో దేశవ్యాప్తంగా కరోనా బారిన పడ్డవారి సంఖ్య 13,36,861కి చేరింది.

వీరిలో వివిధ ఆసుపత్రుల్లో 4,56,071 మంది చికిత్స పొందుతుండగా.. 8,49,432 మంది వ్యాధి నుంచి కోలుకుని ఇళ్లకు చేరారు.

## ఎమ్మెల్యేకు పాజిటివ్.. ఆరుబయట అసెంబ్లీ



పుదుచ్చేరి: కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీలో కరోనా కలకలం రేపింది. ఆల్ ఇండియా ఎన్.ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఎన్.ఎస్.జె. జయబాల్ కొవిడ్-19 బారిన పడ్డారు. దీంతో ఆయనను ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యేకు కరోనా సోకడంతో ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను ఆరుబయటకు మార్చారు. పుదుచ్చేరి అసెంబ్లీలో ఈ నెల 20న బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు.

ఆ రోజుతో పాటు, మరుసటి రోజు సమావేశాల్లోనూ జయబాల్ పాల్గొన్నారు. బడ్జెట్ రోజున నిర్వహించిన వాకౌట్ కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు. తాజాగా ఆయనకు కరోనా తేలడంతో అసెంబ్లీలో శానిటైజేషన్ చేపట్టారు. ఆయనతో పాటు నేరుగా కాంటాక్ట్ ఉన్న ఎమ్మెల్యేలు ఇప్పటికే ఐసోలేషన్‌కు వెళ్లిపోయారు. దీంతో ప్రస్తుతం జరుగుతున్న సమావేశాలను ఇవాళ ఆరుబయట నిర్వహించారు.


ఇలా ఆరుబయట అసెంబ్లీ సమావేశాలు నిర్వహించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. రేపటిలోగా బడ్జెట్‌ను ఆమోదించి సోమవారం నుంచి మిగిలిన సభ్యులు కూడా వైద్య పరిశీలనకు వెళ్లనున్నారు.

## అదే మా ప్రభుత్వం ధ్యేయం



విజయవాడ: చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు పనిపాట లేదని.. సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని మంత్రి శంకర్ నారాయణ విమర్శించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ అభివృద్ధికి చంద్రబాబు నాయుడు అడ్డుపడు తున్నారన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసిన ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. కరోనా కట్టడిలో దేశానికి ఆదర్శంగా ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఉందని పేర్కొన్నారు. ఏపీ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటకీ సంక్షేమ పథకాల అమలులో సీఎం వైఎస్ జగన్ రాజీపడలేదన్నారు. ఆయన సంక్షేమ పాలన చూసి ప్రతిక్షాలు ఓర్వలేకపోతున్నాయని మంత్రి మండిపడ్డారు.

## ఇప్పటికీ అర్థం కాని విషయమది





ఇంటర్‌నెట్ డెస్క్: ఆస్ట్రేలియా దిగ్గజ స్పిన్నర్ షేన్‌వార్న్‌తో తననెందుకు పోలుస్తారో అర్థం కాదని టీమ్‌ఇండియా మాజీ సారథి, కోచ్ అనిల్ కుంబ్లే అన్నారు. వార్న్, మురళీధరన్ తర్వాత ఎక్కువ వికెట్లు తీసినందుకు అద్భుతంగా అనిపిస్తుందని పేర్కొన్నారు. జింబాబ్వే మాజీ క్రికెటర్, వ్యాఖ్యత పామి ఎంబగ్వాతో ఇన్‌స్టాగ్రామ్‌లో జంబో మాట్లాడిన సంగతి తెలిసిందే. 'ఎక్కువ వికెట్లు తీసినందుకు అద్భుతంగా అనిపిస్తుంది. అయితే గణాంకాలు, సగటు గురించి ఎక్కువగా ఆలోచించను. రోజంతా బౌలింగ్ చేసి వికెట్లు తీయాలన్నదే నా అభిమతం. షేన్‌వార్న్, మురళీధరన్ తర్వాత టెస్టుల్లో ఎక్కువ వికెట్లు తీయడం ప్రత్యేకం. ఎందుకంటే మేము ఒకేతరంలో ఆడాం. అందుకే ఎక్కువ పోలికలు వచ్చాయి. కానీ ప్రజలు వార్న్‌తో ఎందుకు నన్ను పోలుస్తారో అర్థం కాదు. అతడు చాలా భిన్నం' అని కుంబ్లే అన్నారు. 'వారిద్దరూ ఎలాంటి పిచ్‌పై అయినా బంతిని గింగిరాలు తిప్పగలరు. అందుకే వార్న్, మురళీతో నన్ను పోల్చినప్పుడు నిజంగా ఇబ్బందిగా అనిపిస్తుంది. వారిద్దరినీ చూసి నేనెన్నో విషయాలు నేర్చుకున్నాను' అని కుంబ్లే తెలిపారు. 2008లో క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఆయన సుదీర్ఘ ఫార్మాట్‌లో 619 వికెట్లు తీసిన సంగతి తెలిసిందే. ముత్తయ్య మురళీధరన్ 800, షేన్‌వార్న్ 708 వికెట్లు పడగొట్టారు. కాగా జిమ్‌లేకర్ తర్వాత ఒకే ఇన్నింగ్స్‌లో 10 వికెట్లు తీసిన ఘనత మాత్రం కుంబ్లేకే దక్కింది. అదీ దాయది పాక్‌పై కావడం గమనార్హం.

### ఢిల్లీలో కొత్తగా 450 పడకల ప్రభుత్వ ఆసుపత్రి

న్యూఢిల్లీ : ఒకప్పుడు కరోనా హాట్ స్పాట్‌గా ఉన్న దశ నుంచి ఇప్పుడు కరోనాపై విజయం సాధిస్తోన్న స్థాయికి ఢిల్లీ చేరిందని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం బురారీలో 450 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ.. ఢిల్లీ ప్రభుత్వ ఆసుత్రుల్లో మౌలిక సదుపాయాలను ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తీసిపోకుండా పెంచామని రానున్న కాలంలో మరిన్ని ఆసుప్రతులు నిర్మించనున్నట్లు తెలిపారు.

గత నెలతో పోలిస్తే రాష్ట్రంలో కరోనా కేసులు గణనీయంగా తగ్గాయని, మరణాల రేటు కూడా తక్కువగా ఉన్నట్లు తెలిపారు. జూన్ 23న ఒక్కరోజే అత్యధికంగా 3947 కేసులు నమోదవగా ప్రస్తుతం వెయ్యికి తక్కువగానే కేసులు నమోదవుతున్నాయన్నారు.

## మద్యం వేళలు పెంచడం నిషేధంలో భాగమా?




అమరావతి: రాష్ట్రంలో రోజూ వేల సంఖ్యలో కరోనా కేసులు నమోదవుతున్నా, క్వారంటైన్ కేంద్రాల్లో వసతులు లేవని తెదేపా నేత నారా లోకేశ్ ఆరోపించారు. కనీసం సరైన భోజనం లేదంటూ బాధితులు గగ్గోలు పెడుతున్నారని అన్నారు. కరోనా కారణంగా రోడ్లపైనే ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాంటి సమయంలో ముఖ్యమంత్రి జగన్ జెటాక్స్ వసూళ్ల కోసం పరితపిస్తున్నారని విమర్శించారు. మద్యం దుకాణాలు రాత్రి 9 వరకు తెరిచి ఉంచాలన్న ఆదేశాలు దుర్మార్గమని మండిపడ్డారు. మద్యం దుకాణాలు ఇప్పటికే కరోనా కేంద్రాలుగా మారిపోయాయని అన్నారు. ధరలు పెంచి మద్యపాన నిషేధం చేస్తున్నామని గొప్పలు చెప్పారని, రాత్రి 9 వరకు పెంచడం కూడా అందులో భాగమేనా అని లోకేశ్ వ్యాఖ్యానించారు.

## చెవుల్లో కూడా కరోనా వైరస్

### ముక్కు, గొంతే కాదు.. చెవుల ద్వారా కూడా కరోనా!

### కరోనా మృతుల చెవిభాగాల్లో వైరస్ ఉనికి

### కరోనా సోకిందనడానికి వినికిడి లోపం కూడా ఒక లక్షణం కావచ్చు





న్యూఢిల్లీ: కరోనా వైరస్ కట్టడికి వ్యాక్సిన్ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రయత్నాలు శరవేగంగా కొనసాగుతున్న తరుణంలో మరో విషయం వెలుగులోకి వచ్చింది. చెవుల ద్వారా కూడా కరోనా వ్యాపిస్తుందనే అంచనాలను తాజాగా పరిశోధకులు తమ అధ్యయనంలో కనుగొన్నారు. చెవి వెనుక ఉన్న పుర్రె, చెవిలోని మాస్టాయిడ్ ఎముకకు కూడా ఈ వైరస్ సోకుతుందని కొత్త పరిశోధన తేల్చింది. కోవిడ్?-19 తో మరణించిన రోగులపై హెడ్ అండ్ నెక్ శస్త్రచికిత్స విభాగం నిర్వహించిన ఈ అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడైనాయి. జాన్స్ హాప్కిన్స్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకులు ముగ్గురుపై చేసిన ఒక చిన్న అధ్యయనంలో, ఇద్దరికి మధ్య చెవుల్లోనే కాకుండా వెనుక చెవిలో కూడా అధిక వైరల్ లోడ్లు ఉ?న్నట్టు గుర్తించారు. కరోనాతో చికిత్స పొంతుదున్న రోగుల మరణానికి ముందు వారి నమూనాలను సేకరించి ఈ పరిశోధన నిర్వహించినట్టు వెల్లడించారు.ఇప్పటి వరకు ముక్కు, గొంతు, ద్వారా ఊపిరితిత్తులలోకి పాకుతుందని అందరికీ తెలుసు. చెవిలోని ప్రధాన భాగమైన మస్టాయిడ్ (కర్ణభేరి) ప్రాంతంలో వైరస్‌ను తాజాగా గుర్తించారు. 80 ఏళ్ల మహిళకు కుడి మధ్య చెవిలో మాత్రమే వైరస్ రాగా, 60 ఏళ్ల వ్యక్తికి ఎడమ, కుడి కర్ణబేరిలోనూ, ఎడమ,కుడి మధ్య చెవులలో వైరస్‌ను గుర్తించామని తెలిపారు. అయితే కరోనా అత్యంత తీవ్రంగా ఉండేవారికి మాత్రమే చెవుల్లోకి ప్రవేశిస్తుందా లేదంటే బయట నుంచి చెవుల ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తుందా అనేదానిపై స్పష్టత లేదని, దీనిపై మరిన్నిపరిశోధనలు అవసరమని వీరు భావిస్తున్నారు. చెవుల స్వాబ్‌ను కూడా పరిశీలించాలని ఈ అధ్యయన బృందం సర్జన్లను హెచ్చరించింది. అలాగే సకింగ్ ట్యూబ్స్ ద్వారా మధ్య చెవి స్వాబ్ సేకరించే సమయంలో సర్జన్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. హెన్రీ ఫోర్డ్‌లోని ఓటోలారింగాలజీలో ఈ స్టడీ ప్రచురితమైంది. కరోనా వైరస్ చెవి ఇన్ఫెక్షన్లు లేదా చెవి సమస్యలతో ముడిపడి ఉందని వెల్లడి కావడం ఇదే మొదటిసారి కాదు. ఏప్రిల్, 2020 నాటి ఒక అధ్యయనంలో కరోనా రోగుల్లో చెవిపోటు, వినికిడి లోపం లాంటి లక్షణాలను కనుగొన్నారు. అంతకుముందు వినికిడి సమస్యల చరిత్ర లేకపోయినా, కరోనా సోకిన తరువాత ఈ సామర్థ్యం క్షీణించినట్టు మరో అధ్యయనంలో కనుగొన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com